నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ శుక్రవారం 10-12-2021 RNI No.52865/93·Postal No\.H/SD/258/2020-2022 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి :28 సంచిక: 105 పేజీలు: 4 వెల: రూ.1/-

పాలం ఎయిర్‌పోర్ట్‌లో బిపిన్ రావత్‌కు నివాళులు అర్పించనున్న మోదీ, రాజ్‌నాథ్ సింగ్!

న్యూఢిల్లీ, డిసెంబర్ 9:: తమిళనాడులో బుధవారం మధ్యాహ్నం హెలికాప్టర్ కుప్పకూలిన ఘటనలో మరణించిన సీడీఎస్ బిపిన్ రావత్ సహా ఇతరుల భౌతిక కాయాలు ఢిల్లీలోని పాలం ఎయిర్‌పోర్ట్‌కు గురువారం రాత్రి చేరుకోనున్నాయి. ఎయిర్‌పోర్ట్‌లో రావత్‌తో పాటు మృతుల భౌతిక కాయాలను ప్రధాని నరేంద్ర మోదీ, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సహా పలువురు ప్రముఖులు సందర్శించి వారికి నివాళులు అర్పిస్తారు.బిపిన్ రావత్‌తో పాటు మృతుల అంత్యక్రియలు శుక్రవారం ఢిల్లీ కంటోన్మెంట్‌లో జరగనున్నాయి. తమిళనాడులోని కూనూర్‌లో హెలికాప్టర్ కుప్పకూలిన ఘటనలో బిపిన్ రావత్‌తో పాటు ఆయన భార్య మధులిక రావత్, బ్రిగేడియర్ ఎల్ఎస్ లిద్దర్, లెఫ్టినెంట్ కల్నల్ హర్జిందర్ సింగ్, వింగ్ కమాండర్ పీఎస్ చౌహాన్, స్క్వాడ్రన్ లీడర్ కే సింగ్, జేడబ్ల్యూఓ దాస్, ప్రదీప్, సత్పాల్, నాయక్ గురుసేవక్ సింగ్, నాయక్ జితేంద్ర కుమార్, లాన్స్ నాయక్ వివేక్ కుమార్, లాన్స్ నాయక్ సాయితేజ మరణించారు.

సచివాలయ నిర్మాణ పనులను పరిశీలించిన సీఎం కేసీఆర్

హైదరాబాద్, డిసెంబర్ 9: నూతన సచివాలయ నిర్మాణ పనులను ముఖ్యమంత్రి కేసీఆర్ గురువారం మధ్యాహ్నం పరిశీలించారు.

సచివాలయ నిర్మాణ పనుల గురించి ఆర్ అండ్ బీ అధికారులు, ఇంజినీర్లు సీఎం కేసీఆర్‌కు వివరించారు. పనుల పురోగతిని అధికారులను అడిగి సీఎం కేసీఆర్ తెలుసుకున్నారు. ఏడు అంతస్తుల సచివాలయ నిర్మాణాన్ని తెలంగాణ ప్రభుత్వం తలపెట్టిన సంగతి తెలిసిందే.

ఇప్పటి వరకు ఆరు అంతస్తుల స్లాబ్ పనులు పూర్తయ్యాయి. రాత్రింబవళ్లు మూడు షిఫ్టుల్లో నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. సచివాలయ నిర్మాణ పనులను షాపూర్ జీ పల్లోంజీ కంపెనీ చేపట్టింది. సీఎం కేసీఆర్ వెంట మంత్రులు ప్రశాంత్ రెడ్డి, సబితా ఇంద్రారెడ్డి, సీఎస్ సోమేశ్ కుమార్‌తో పాటు పలువురు అధికారులు ఉన్నారు.

ఆందోళన విరమించిన రైతులు.. ఇంటి బాట పట్టిన అన్నదాతలు

న్యూఢిల్లీ, డిసెంబర్ 9:మూడు వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా దాదాపు ఏడాది కాలంగా ఉద్యమం చేస్తున్న రైతులు ఆందోళనలను విరమించారు. ఢిల్లీ సమీపంలోని సింఘు సరిహద్దులో రైతులు తమ టెంట్లు తీసేసి ఇళ్లకు వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు.

మూడు సాగు చట్టాలను కేంద్రం ప్రభుత్వం ఇటీవల రద్దు చేసింది. ఈ శీతాకాల సమావేశాల్లో మూడు వ్యవసాయ చట్టాలను రద్దు బిల్లు ఆమోదం తెలపడంతో పాటు కనీస మద్దతు ధర, రైతులపై కేసులు ఎత్తివేయడం, విద్యుత్ చట్టాలను రద్దు చేయాలనే డిమాండ్లపై కేంద్రం రైతులకు హామీ ఇచ్చింది. దీంతో సంయుక్త కిసాన్ మోర్చా రైతుల తమ ఆందోళనను విరవించారు. కనీస మద్దతు ధరపై కేంద్రం కమిటీని నియమించింది.

వివాదాస్పద సాగు చట్టాలను రద్దు చేయాలంటూ గతేడాది నవంబర్ 26న రైతులు ఢిల్లీ సరిహద్దులో ఆందోళన మొదలు పెట్టారు. ఈ ఆందోళనలో ఉత్తర్ ప్రదేశ్, హర్యానా, పంజాబ్, ఉత్తరాఖండ తదితర రాష్ట్రాల నుంచి లక్షల సంఖ్యలో రైతులు ఆందోళనలు చేశారు. ఈ ఏడాది ఉద్యమ కాలంలో ఉద్యమంలో పాల్గొన్న 700 మంది రైతులు మృతి చెందారు. ఈ నేపథ్యంలో ఇటీవల సాగు చట్టాలను రద్దు చేస్తూ కేంద్రం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు నవంబర్ 19న దేశ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మూడు సాగు చట్టాలను వెనక్కి తీసుకుంటున్నామని ప్రకటించారు. ఇందుకు కేంద్ర కేబినెట్ కూడా ఆమోదం తెలిపింది.

బిపిన్ రావత్ భౌతికకాయానికి గవర్నర్ తమిళిసై నివాళి

ఊటీ, డిసెంబర్ 9:: నీలగిరి కొండల్లో జరిగిన హెలికాప్టర్ ప్రమాదంలో సీడీఎస్ చీఫ్ బిపిన్ రావత్, ఆయన సతీమణి మధులికా రావత్‌తో పాటు మరో 11 మంది మృతిచెందిన విషయం తెలిసిందే. అయితే ఇవాళ నీలగిరి జిల్లాలో ఉన్న మద్రాస్ రెజిమెంట్ సెంటర్‌లో వీరసైనికుల భౌతికకాయాలకు గార్డ్ ఆఫ్ హానర్ నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందరరాజన్ నివాళి అర్పించారు. సైనికవీరుల పార్థివదేహాల ముందు పుష్పగుచ్ఛం ఉంచి శ్రద్ధాంజలి ఘటించారు.

గవర్నర్ తమిళిసై తన ట్విట్టర్‌లో సీడీఎస్ జనరల్ బిపిన్ రావత్ మృతి పట్ల ప్రగాఢ సానుభూతి తెలిపారు. ప్రమాదంలో మరణించిన ఆర్మీ సిబ్బంది కూడా ఆమె నివాళి అర్పించారు. జనరల్ రావత్ దేశానికి అత్యున్నత సేవలు అందించారని, బాధాతప్త హృదయంతో అమర కుటుంబాలకు నివాళి అర్పిస్తున్నట్లు ఆ ట్వీట్‌లో ఆమె తెలిపారు.

టీఆర్ఎస్‌లో చేరిన ఇద్దరు ఎంపీటీసీలు

తుంగతుర్తి, డిసెంబర్ 9:: టీఆర్ఎస్‌లోకి వలసల పర్వం కొనసాగుతూనే ఉంది.

అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు వివిధ పార్టీల నుంచి టీఆర్ఎస్‌లో చేరుతున్నారు. తాజాగా సూర్యాపేట జిల్లా తుంగతుర్తి తుంగతుర్తి నియోజకవర్గానికి చెందిన రామన్నగూడెం బీజేపీ పార్టీ ఎంపీటీసీ ఆంబోతు నరేష్, దత్తప్పగూడెం కాంగ్రెస్ ఎంపీటీసీ ఆకవరం లక్ష్మణాచారి గురువారం మంత్రి జగదీష్ రెడ్డి, తుంగతుర్తి ఎమ్మెల్యే డా.గాదరి కిశోర్ కుమార్ సమక్షంలో టీఆర్ఎస్ చేరారు.

వారికి గులాబీ కండుకాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, జెడ్పీచైర్పర్సన్ గుజ్జ దీపిక, ఎమ్మెల్సీ అభ్యర్థి ఎంసీ కోటిరెడ్డి, రాష్ట్ర ఉన్నత విద్యామండలి సభ్యుడు ఒంటెద్దు నర్సింహారెడ్డి, రాష్ట్ర ఆయిల్ ఫెడ్ చైర్మన్ కంచర్ల రామకృష్ణ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జనరల్ రావత్ ప్లేసులో సీడీఎస్ గా జనరల్ మనోజ్ ముకుంద్ నరవణె..

న్యూఢిల్లీ, డిసెంబర్ 9:తమిళనాడులోని కూనూర్‌లో జరిగిన హెలికాప్టర్ ప్రమాదంలో జనరల్ బిపిన్ రావత్ ప్రాణాలు కోల్పోయారు. దేశ రక్షణ రంగంలో కీలకమైన సీడీఎస్ (చీఫ్ డిఫెన్స్ ఆఫ్ స్టాఫ్) పదవిలో ఉన్న ఆయన ఆకస్మిక మరణంతో తదుపరి సీడీఎస్ ఎవరనే చర్చ మొదలైంది. బిపిన్ రావత్ వంటి అనుభవజ్ఞుడు, వ్యూహకర్త ఎవరు? ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్ త్రివిధ దళాలను సమన్వయం చేయగలిగే సమర్థుడు ఎవరు? తదుపరి త్రిదళాధిపతిగా ఎవరికి అవకాశం ఉంది.. ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్ అధిపతుల్లో ఎవరికి ఎక్కువ అవకాశం ఉంది? అన్న విషయాలపై ఆసక్తికర చర్చ జరుగుతోంది.

రేసులో ఆయనే ముందు..

నేవీ, ఎయిర్‌ఫోర్స్‌కి ఇటీవలే కొత్త అధిపతులు వచ్చారు. నేవీ చీఫ్‌గా అడ్మిరల్ ఆర్. హరికుమార్ 8 రోజుల క్రితమే బాధ్యతలు స్వీకరించారు. ఎయిర్ చీఫ్ మార్షల్ వివేక్ రామ్ అయితే ఈ ఏడాది సెప్టెంబర్ 30 నుంచి ఎయిర్‌ఫోర్స్ అధిపతిగా ఉంటున్నారు. జనరల్ మనోజ్ ముకుంద్ నరవణె మాత్రమే 2019 డిసెంబర్ 31 నుంచి ఆర్మీ అధిపతిగా కొనసాగుతున్నారు. ఇలా చూస్తే బిపిన్ తర్వాత ఆర్మీ చీఫ్ జనరల్ నరవణె మాత్రమే సీనియర్ అధికారి అవుతారు. ఈ క్రమంలో రావత్ స్థానంలో నరవణెను నియమించినట్టు తెలుస్తోంది.

శీతాకాల సమావేశాల్లో.. తొలిసారి సజావుగా సాగిన రాజ్యసభ

న్యూఢిల్లీ, డిసెంబర్ 9:పార్లమెంట్ శీతాకాల సమావేశాలు ప్రారంభమైన పది రోజుల తర్వాత రాజ్యసభా కార్యక్రమాలు తొలిసారి సజావుగా సాగాయి. సభ లోపల, బయట కొనసాగిస్తున్న నిరసనలకు విపక్ష సభ్యులు గురువారం విరామం ఇచ్చారు. తమిళనాడులో సైనిక హెలికాప్టర్ ప్రమాదంలో మరణించిన సీడీఎస్ జనరల్ బిపిన్ రావత్, ఆయన భార్య, మరో 11 మంది రక్షణ సిబ్బందికి నివాళి అర్పించారు. నవంబర్ 29న పార్లమెంట్ శీతాకాల సమావేశాలు ప్రారంభమయ్యాయి. కాగా, గత సమావేశాల్లో భద్రతా సిబ్బంది పట్ల అమర్యాదగా ప్రవర్తించిన 12 మంది సభ్యులను శీతాకాల సమావేశాల వరకు సస్పెండ్ చేశారు. దీంతో రాజ్యసభలో తొలి రోజు నుంచే విపక్ష సభ్యులు నిరసనకు దిగారు. 12 మంది సభ్యుల సస్పెన్షన్ ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ సభ లోపల, వెలుపల నిరసనలు కొనసాగిస్తున్నారు. బుధవారం టీడీపీ, వైసీఎస్ఆర్‌సీపీ సభ్యులు తప్ప మిగతా పార్టీలకు చెందిన సభ్యులు సభా కార్యక్రమాలను బహిష్కరించారు. పార్లమెంట్ ఆవరణలోని గాంధీ విగ్రహం వద్ద నిరసన చేశారు.కాగా, హెలికాప్టర్ ప్రమాదంలో మరణించిన బిపిన్ రావత్, ఇతరులకు నివాళి అర్పించేందుకు గురువారం మాత్రమే నిరసనలకు విరామం ఇచ్చినట్లు రాజ్యసభ్యలో విపక్ష నేత మల్లిఖార్జున్ ఖర్గే గురువారం తెలిపారు. అయితే ఈ ఘటనపై మాట్లాడేందుకు విపక్ష సభ్యులకు అవకాశం ఇవ్వని డిప్యూటీ చైర్మన్‌పై ఆగ్రహం వ్యక్తం చేసినప్పటికీ జీరో హవర్, ప్రశ్నోత్తరాలు సజావుగా సాగేందుకు సహకరించామన్నారు.

నేడే స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలకు పోలింగ్

హైదరాబాద్, డిసెంబర్ 9: ఈ నెల 10వ తేదీన ఆరు స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలకు పోలింగ్ ప్రక్రియ జరగనుంది. పోలింగ్‌కు సంబంధించి ఎన్నికల అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు.

ఈ ఎన్నికల నిర్వహణకు సంబంధించి మొత్తం 37 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. 5,326 ఓటర్లు ఉన్నారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరగనుంది. మెదక్, ఆదిలాబాద్, నల్లగొండ, ఖమ్మం జిల్లాల్లో ఒక్కో ఎమ్మెల్సీ స్థానానికి, కరీంనగర్ జిల్లాలో రెండు ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికలను బ్యాలెట్ పద్ధతిలో నిర్వహించనున్నారు. పోలింగ్ కేంద్రాలకు సిబ్బంది చేరుకున్నారు. పోలింగ్ సెంటర్లలోకి సెల్‌ఫోన్ల అనుమతి ఉండదు. సీసీ కెమెరాలతో పాటు వెబ్ కాస్టింగ్ చేయనున్నారు. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపు ఈ నెల 14న చేపట్టనున్నారు. అప్పటి వరకు స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద భద్రత కట్టుదిట్టం చేయనున్నారు.

ఆదివాసీల సంప్రదాయాలకు అనుగుణంగా మేడారం జాతర పనులు : కృష్ణ ఆదిత్య

ములుగు, డిసెంబర్ 9:: ఆదివాసీ సంఘాల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకొని, గిరిజన సంస్కృతి సంప్రదాయాలతో మేడారం జాతరను విజయవంతంగా నిర్వహిస్తామని జిల్లా కలెక్టర్ కృష్ణ ఆదిత్య అన్నారు. గురువారం క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా మేడారం జాతర పరిసర ప్రాంతాల్లో భక్తుల సౌకర్యార్థం నిర్మించిన షెడ్ నందు మేడారం జాతర నిర్వహణపై ఆదివాసీ సంఘాలతో సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ కృష్ణ ఆదిత్య ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..వివిధ ఆదివాసీ సంఘాల పెద్దలు సమావేశంలో వారి అభిప్రాయాలను వ్యక్తం చేశారని, వాటన్నిటిని రాతపూర్వకంగా ఇచ్చినట్లయితే ఆదివాసీ సంఘాల పెద్దలతో మరొకసారి సమావేశం ఏర్పాటు చేసి నిర్ణయం తీసుకుంటామన్నారు.

శబరిమలలో రోడ్డు ప్రమాదం.. కర్నూలు స్వాములు మృతి

హైదరాబాద్, డిసెంబర్ 9:శబరిమలలో గురువారం ఉదయం జరిగిన ఒక రోడ్డు ప్రమాదంలో కర్నూలు జిల్లాకు చెందిన ఇద్దరు అయ్యప్పస్వాములు దుర్మరణం పాలయ్యారు. వీరు శబరిమల దేవస్థానానికి సమీపంలో రోడ్డుపై టీ టాగేందుకు వాహనం నిలుపగా ఈ ప్రమాదం సంభవించింది. కేరళ పోలీసులు కర్నూలు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ప్రమాదం విషయం వెలుగులోకి వచ్చింది.

కర్నూలు బుధవారపేటకు చెందిన అయ్యప్పస్వాములు 11 మంది బుధవారం వ్యానులో శబరిమలకు బయల్దేరారు. గురువారం ఉదయం 9.30 గంటల ప్రాంతంలో టీ తాగేందుకు రోడ్డు వారగా వ్యాన్ నిలిపి కిందికి దిగారు. ఇంతలో మరో వాహనం వేగంగా దూసుకొచ్చి వీరి వ్యాన్‌ను ఢీకొట్టింది. అనంతరం స్వాములపైకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో ఇద్దరు స్వాములు మృతిచెందగా.. తొమ్మిది మంది గాయపడ్డారు. మృతులను బుధవారపేట దేవ్‌నగర్‌కు చెందిన ఆదినారాయణ, శంకర్‌గా గుర్తించారు. ఈ ఘటనకు సంబంధించి మరిన్ని వివరాలు తెలియాల్సి ఉన్నది. శబరిమలకు 60 కిలోమీటర్ల దూరంలో ఈ ప్రమాదం జరిగినట్లు సమాచారం. స్థానికులు పోలీసులకు సమాచారం అందించి క్షతగాత్రులను సమీపంలోని దవాఖానకు తరలించారు. కేరళ పోలీసులు కర్నూలు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ప్రమాదం విషయం వెలుగులోకి వచ్చింది.

రూ.5లక్షల ఎల్ఓసీని అందజేసి చేసిన ప్రభుత్వ విప్ బాల్క సుమన్

మంచిర్యాల,డిసెంబర్ 9:: సీఎంఆర్ఎఫ్ నిరు పేదలకు వరని ప్రభుత్వ విప్, చెన్నూరు ఎమ్మెల్యే బాల్క సుమన్ అన్నారు. జిల్లాలోని కోటపల్లి మండలం జనగామ గ్రామానికి చెందిన పల్లె కిష్టయ్యకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ.5లక్షల ఎల్ఓసీని ప్రభుత్వ విప్ బాల్క సుమన్, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ పురాణం సతీశ్ కుమార్ అందచేశారు. కిష్టయ్య అనారోగ్యానికి గురై హైదరాబాద్‌లోని నిమ్స్‌లో చేరాడు.ఈ విషయాన్ని జనగామ ఎంపీటీసీ మారిశెట్టి తరుపతి విప్ బాల్క సుమన్ దృష్టికి తీసుకెళ్లాడు.

వెంటనే స్పందించిన సుమన్ సీఎంఆర్ఎఫ్ నుంచి రూ. 5లక్షల ఎల్ఓసీని మంజూరు చేయించి బాధిత కుటుంబానికి పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వాల శ్రీనివాస్ రావు, ఎంపీటీసీలు చంద్రగిరి శంకర్, జేక శేఖర్, గోమాస రజిత, పుప్పిరెడ్డి మొండక్క, కుంభం సరోజన పాల్గొన్నారు.

ఈ ఏడాది ఉపాధి సామర్థ్యం 46.2శాతం వృద్ధి : ఇండియా స్కిల్స్ రిపోర్ట్ 2022

సీఐఐ, ఏఐసీటీఈ, ఏఐయు, ట్యాగ్, సన్‌స్టోన్ ఎడ్యువర్శిటీ, యుఎన్‌డీపీ సహకారంతో వీబాక్స్ తమ ఇండియా స్కిల్స్ రిపోర్ట్ (ఐఎస్ఆర్) 2022 ను విడుదల చేసింది. ప్రతిభావంతుల కోసం డిమాండ్, సరఫరా నడుమ ఉన్న అంతరాలను ఈ నివేదిక వెల్లడిస్తుంది. ఐఎస్ఆర్ 2022ప్రకారం మొత్తంమ్మీద 46.2శాతం మంది యువత గత సంవత్సరం ఉపాధి సామర్థ్యం అయిన 45.97శాతంతో పోలిస్తే మరింత మెరుగ్గా ఉపాధి సామర్థ్యం కలిగి ఉన్నారు. వీబాక్స్ ఫౌండర్ అండ్ సీఈఓ నిర్మల్ సింగ్ మాట్లాడుతూ? మహమ్మారి మనకు రిమోట్ అభ్యాసం, రిమోట్ వర్క్ వంటివి పరిచయం చేయడంతో పాటుగా ఐటీ, బిజినెస్ కన్సల్టెన్సీ, ఫైనాన్షియల్ సర్వీసెస్‌లలో ఇవి సాధారణతగా మార్చిందన్నారు. మరీ ముఖ్యంగా విద్యా రంగం దీనికి నేతృత్వం వహిస్తుందని అన్నారు. గత కొద్ది సంవత్సరాలుగా నేషనల్ ఎంప్లాయబిలిటీ టెస్ట్‌లో క్రిటికల్ థింకింగ్, న్యూమరికల్ ఎబిలిటీ రంగాల్లో అపార ప్రతిభ కనబరుస్తున్న విద్యార్థులు సీనియన్ ఎనలిస్ట్, బిగ్ డాటా ఇంజినీరింగ్ బాధ్యతలలో అత్యంత వేగంగా వృద్ధి చెందడంతో పాటుగా మెరుగైన అవకాశాలను పొందుతున్నారన్నారు. అందువల్ల, ఉద్యోగార్హత నైపుణ్యాలనేవి విద్యార్థుల ఉద్యోగ విజయానికి నడుమ ప్రత్యక్ష సంబంధం కలిగిఉందన్నారు.

చరిత్రలో నేటినిజం

కం॥ శ్రేయో దాయకుడు, ఘనుడు
గాయకుడును, ఖాత్రుడుంబు, కవుబాస్త్రుడునున్
ధీరుడుమరి, శుద్ధకుడునను
"బాలమురళి"శాస్త్రి గాల చెద ప్రియాదులర్పున్ !!

(డిసెంబర్ 10 చరిత్ర పరిశోధకులు శ్రీ బి.యస్. శాస్త్రిగారి జయంతి...)

-రాధశ్రీ
సెల్: 9494481210

సాదర ఆహ్వానము

డా॥గొల్లపెల్లి రాంకిషన్ (రాఖీ) గారి
పన్నెండు పుస్తకాల పురిటి పండగ

తేది: 12-12-2021, ఆదివారం
సమయం: సా॥4.41 గం.లకు

వేదిక: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, నాంపెల్లి, హైదరాబాద్

గ్రంథాల ఆవిష్కర్త
డా.శ్రీ .కే.వి. రమణ గారు.I.A.S (R)
రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు,తెలంగాణ

ముఖ్య అతిథి
పద్మశ్రీ ఆచార్య కొలకలూరి ఇనాక్ గారు
పూర్వ ఉపాధ్యక్షులు, శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం

సభాధ్యక్షులు:
ఆచార్య వెలుదండ నిత్యానంద రావు గారు
పూర్వ అధ్యక్షులు, తెలుగు శాఖ, ఉస్మానియా విశ్వవిద్యాలయం

విశిష్ట అతిథులు:
డా॥ కసిరెడ్డి వేంకటరెడ్డి గారు,
పూర్వ అధ్యక్షులు, తెలుగు శాఖ, ఉస్మానియా విశ్వవిద్యాలయం
శ్రీ మామిడి హరికృష్ణ గారు,
సంచాలకులు భాషా సాంస్కృతిక శాఖ
శ్రీ కోసూరి లక్ష్మణ్ రావు గారు,
జనరల్ మేనేజర్ (విక్రాంత) S.B.I
శ్రీ డా.శ్రీధర్ కస్తూరి గారు,
MD.DM ప్రముఖ కార్డియాలజిస్ట్
శ్రీ ఎ.జగన్ మోహన్ రెడ్డి గారు,
కర్టన్ ఆర్ట్‌ప్రింటర్స్, హైదరాబాద్

ఆత్మీయ అతిథులు:
డా॥ సంగనభట్ల నరసయ్య గారు
ప్రిన్సిపాల్(విక్రాంత) శ్రీ.ఎ.న.సం.ఆ.కళాశాల,ధర్మపురి
డా॥ అయాచితం నటేశ్వర శర్మ గారు
ప్రిన్సిపాల్(విక్రాంత) ప్రొ.వి.ప.ఓ.కళాశాల,కామారెడ్డి
డా॥ పి. వారిజా రాణి గారు,
సహ ఆచార్యులు తెలుగు శాఖ, ఉస్మానియా విశ్వవిద్యాలయము
శ్రీ రామాచారి గారు,
ప్రముఖ సినీ, లలిత సంగీత దర్శకులు
శ్రీ కే.బి.శర్మ గారు, ప్రముఖ సంగీత దర్శకులు

పుస్తక సమీక్షకులు : డా॥ వొజ్జల శరత్ బాబు గారు

వ్యాఖ్యాత: శ్రీ అనంతా చార్య గారు

భారతీయ హస్తకళలకు విదేశీ ఆదరణ

(డిసెంబర్ 14 వరకు "అఖిల భారత హస్తకళల వారోత్సవాలు" సందర్భంగా)

ప్రముఖ సంఘ సంస్కర్త, స్వాతంత్ర్య సమర యోధురాలు, మహాత్మాగాంధీ ప్రియ శిష్యురాలైన స్వర్గీయ శ్రీమతి కమలా చటోపాధ్యాయ భారతీయ చేనేత హస్తకళల పట్ల చూపిన ఆదరణ, అంకితభావాలను గుర్తుచేసుకుంటూ ప్రతి అట డిసెంబర్ 08-14 తేదీల్లో "అఖిల భారత హస్తకళల వారోత్యవాలు" పెద్ద ఎత్తున నిర్వహించుట ఆనవాయితీగా మారింది. చేనేత, హస్తకళల పట్ల ప్రజలకు ఆదరణ, అవగాహన, ప్రోత్సాహం, చేయూత, బహుళ ప్రచారం, కళాకారులను ప్రోత్సహించడం లాంటి కార్యక్రమాలను ఈ వారోత్సవాల వేదికగా నిర్వహించుట జరుగుతున్నది. భారతీయ హస్తకళల ఉత్పత్తులకు విదేశాల్లో కూడా మంచి ఆదరణ లభిస్తున్న కారణంగా దాదాపు 67,000ల ఎగుమతి కేంద్రాలను ప్రభుత్వాలు ఏర్పాటు చేశారు. హస్తకళల వారేత్సవాలలో భాగంగా మహానగరాలు, పట్టణాలు, మండల కేంద్రాల్లో హస్తకళా ప్రదర్శనలు నిర్వహించడం, నైపుణ్యం కలిగిన కళాకారుల్ని గుర్తించడం, ఉత్పత్తులను కొనడం, ఉత్సాహపరచడం లాంటి చర్యలు తీసుకుంటున్నారు. హస్తకళల కళాకారులలో ఉచిత నైపుణ్య శిక్షణలు, ఉత్పత్తుల మార్కెటింగ్, ఆర్థిక చేయూత, సాంకేతిక వనరుల కల్పన, కళాకారుల ఉత్పత్తులకు సరైన ధరలను కలిపించడం లాంటి చర్యలు తీసుకోవడానికి 1952లో "అఖిల భారత హస్తకళల బోర్డు"ను ఏర్పాటు చేశారు.

అనాదిగా భారత దేశంలో అసంఘటిత హస్తకళల రంగాన్ని సమస్యలు వెంటాడుతున్నాయి. ఆధునిక నైపుణ్య శిక్షణలు అందుబాటులోకి రాకపోవడం, మార్కెటింగ్ వసతులు కల్పించక పోవడం, సరైన ధరలు పలకక పోవడం, గిరాకీ లేకపోవడం లాంటి పలు సమస్యలు ఈ రంగాన్ని పట్టి పీడిస్తున్నాయి. దేశ హస్తకళారంగంలో 7 మిలియన్ల శ్రామికులు, కళాకారులు పని చేస్తున్నారు. ఈ హస్తకళా నిపుణుల్లో 56 శాతం మహిళలు, 44 శాతం పురుషులు, అందులో 21 శాతం యస్‌సిలు, 8 శాతం యస్‌టీలు, 52 శాతం ఓబిసీలు దేశవ్యాప్తంగా విస్తరించబడి ఉన్నారు. హస్తకళల్లో చేనేత వస్త్రాలు, లెదర్, కలప, లోహాలు, బంక మట్టి, ఎముకలు, కొమ్ములు, గవ్వలు, గాజులు, శిల్పాలు, కార్పెట్లు, జరీ ఉత్పత్తులు, పేయింటింగ్‌లు, నార వస్తువులు, వెదురు, కేక్ డెకరేషన్, కొవ్వొత్తులు, పేపర్, వ్యర్థ పదార్థాలు లాంటి వస్తువుల మాధ్యమంగా కళాత్మక కళాఖండాల అద్భుతాలు ఆవిష్కరించబడతాయి. 2019-20 ఏడాది హస్తకళల ఎగుమతులు 3.35 శాతం తగ్గాయి. గత సంవత్సరం 26,213 కోట్ల రూపాయల విలువైన హస్తకళల వ్యాపారం జరుగగా, రూ: 13,412 కోట్ల ఎగుమతులు అయ్యాయి. కోవిడ్-19 కల్లోలాన్ని అధిగమించి 2020-21లో రూ: 24,000 కోట్ల వ్యాపారం జరిగిందని అంచనా.

ప్రపంచ హస్తకళల వ్యాపారంలో ఇండియా 1.2 శాతం మాత్రమే ఉండడం విచారకరం. కర్ర కళలు, ఎంబ్రాయిడరీ,చేనేత, ఇమిటేషన్ ఆభరణాలు, లోహ కళాఖండాలకు అమెరికా, యుకె, యూఏఈ, జర్మనీ, కెనడా, ఆస్ట్రేలియా, ఫ్రాన్స్, నెదర్లాండ్ లాంటి పలు దేశాల్లో మంచి ఆదరణ ఉండటం హర్షదాయకం. దేశ విభిన్న సంస్కృతులు, భిన్నత్వంలో ఏకత్వం, జీవన వైవిధ్యం నెలవుగా ఉన్నందున భారతీయ హస్తకళల్లో అద్వితీయ విలక్షణత కనిపిస్తుంది. దేశీయ మార్కెట్‌లో తీవ్రమైన పోటీ, డిమాండ్-సప్లై వ్యత్యాసం, నాణ్యతలో విదేశీ వస్తువులతో పోటీ, ఈ-ప్రభంజనాన్ని తట్టుకోలేక పోవడం, విదేశీ ఆధునిక సాంకేతికను సత్వరమే అందిపుచ్చుకోలేక పోవడం లాంటి సమస్యలు మన హస్తకళల రంగాన్ని వెంటాడుతున్నాయి. విదేశీ యంత్ర ఉత్పత్తుల కన్న భారత హస్తకళలకు మంచి గిరాకీ ఉండడం కొంత ఉపశమనాన్ని కలిగిస్తున్నది. బ్రాండ్ ఇమేజింగ్ కలిపించడం, క్రాఫ్ట్ ఫెస్టివల్స్/రోడ్డు షోల నిర్వహణ, పబ్లిసిటీ, ఆకర్షణీయ ప్యాకేజింగ్, ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థల సమన్వయం, ఆధునిక సాంకేతిక శిక్షణ ఇవ్వడం, సృజనను ప్రోత్సహించడం, ప్రధాన కూడళ్లలో దుకాణాలు తెరవడం లాంటి చర్యలు హస్తకళల కళాకారుల కళ్ళల్లో ఆనందాన్ని నింపుతాయి. అందరు భారతీయులు మనవైన అందమైన హస్తకళల ఉత్పత్తులను ఆదరిస్తూ, కళాకారులు/శ్రామికవర్గాల ఇంట్లో నవ్వుల పువ్వులు వికసించేలా చూద్దాం. హస్తకళల అందాలను ఆశీర్వదిద్దాం.

- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

రాజ్యాంగ పరిషత్తు తొలి చరిత్రాత్మక సమావేశానికి 75 సంవత్సరాలు పూర్తి

న్యూఢిల్లీ, డిసెంబర్ 9:రాజ్యాంగ పరిషత్తు తొలి చారిత్రిక సమావేశాని కి 75 సంవత్సరాలు పూర్తి అయినందుకు గుర్తు గా రాజ్యాంగ పరిషత్తు యొక్క మహానుభావుల కు ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ నమస్సుల ను అర్పించారు.

"75 సంవత్సరాల కిందట ఇదే రోజు న మన రాజ్యాంగ పరిషత్తు మొట్ట మొదటిసారి గా సమావేశమైంది. భారతదేశం లోని వివిధ ప్రాంతాల నుంచి, విభిన్న నేపథ్యాలు ఆ మాటకొస్తే వేరు వేరు ఆలోచన స్రవంతులు కలిగినటువంటి మహా వ్యక్తులు ఒక చోట గుమికూడారు. వారికి ఉండిన ఉద్దేశ్యం ఒక్కటే.. అది ఏమిటి అంటే భారతదేశ ప్రజల కు ఒక గొప్ప రాజ్యాంగాన్ని అందించాలి అనేదే. ఆ మహానుభావుల కు ఇవే నమస్సులు.

రాజ్యాంగ పరిషత్తు తొలి సమావేశాని కి ఆ పరిషత్తు సభ్యులందరి లోకి వయస్సు లో పెద్ద వారయిన డాక్టర్ సచ్చిదానంద సిన్హా అధ్యక్షత వహించారు.

ఆయన పేరు ను ఆచార్య కృపలానీ గారు ప్రతిపాదించారు; అంతేకాకుండా ఆయన ను ఆచార్య కృపలానీ గారు అధ్యక్ష స్థానం లో కూర్చోబెట్టారు.

ఈ రోజు న, ఎప్పుడయితే మనం రాజ్యాంగ పరిషత్తు యొక్క ఒకటో చరిత్రాత్మకమైన సమావేశానికి 75 సంవత్సరాలు పూర్తి కావడాన్ని గుర్తు కు తెచ్చుకొంటున్నామో, ఈ వేళ నేను నా యువ మిత్రులను కోరేది ఏమిటి అంటే ఈ ప్రసిద్ధ సభ నిర్వహించిన అటువంటి సభా కార్యకలాపాల ను, దీనిలో పాలుపంచుకొన్న మహానుభావుల ను గురించి మరింత ఎక్కువ గా తెలుసుకోండి అనేదే. ఇలా చేయడం వల్ల మేధోపరంగా లభించే అనుభవం సమృద్ధం అవుతుంది." అని పేర్కొన్నారు.

మరో నిర్ణయం వెనక్కి.. ఆ జీవో ఉపసంహరించున్న ఏపీ సర్కార్

న్యూఢిల్లీ, డిసెంబర్ 9:మూడు రాజధానుల బిల్లును ఇటీవల వెనక్కి తీసుకున్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం.. తాజాగా మరో కీలక నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంది. ఏపీ వార్డు, మహిళా కార్యదర్శులను మహిళా పోలీసులుగా నియమిస్తూ గతంలో జారీ చేసిన జీవో నంబర్ 59ను ప్రభుత్వం ఉపసంహరించుకుంది. వారిని ఎలా ఉపయోగించుకోవాలో ప్రభుత్వం ఆలోచించి నిర్ణయం తీసుకోనుంది. ఈ మేరకు ప్రభుత్వ న్యాయవాది ఏపీ హైకోర్టుకు తెలిపారు.

జీవో-59పై దాఖలైన పిటిషన్ ను హైకోర్టు విచారించింది. ఈ సందర్భంగా ప్రభుత్వ నిర్ణయాన్ని న్యాయవాది హైకోర్టుకు దృష్టికి తీసుకొచ్చారు. డ్రెస్‌కోడ్ సైతం ఉపసంహరించుకుంటున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలతో అఫిడవిట్ దాఖలు చేస్తామని చెప్పారు. ఈ కేసుపై విచారణ జరిపిన ధర్మాసనం తదుపరి విచారణను వచ్చే వారానికి వాయిదా వేసింది.

గోషామహల్‌లో బిపిన్ రావత్‌కు నివాళులు

హైదరాబాద్, డిసెంబర్ 9:ఆర్మీ హెలికాప్టర్ నిన్న తమిళనాడు రాష్ట్రంలో కుప్పకూలి సీడీఎస్ చీఫ్ బిపిన్ రావత్ దంపతులతో సహా మొత్తం ఈ ప్రమాదంలో 13 మంది చనిపోయిన విషయం తెలిసిందే. అయితే ఇవాళ నగరంలోని గోషామహల్ లో హెలికాప్టర్ కూలిన ప్రమాదంలో మృతిచెందిన సీడీఎస్ చీఫ్ బిపిన్ రావత్‌కు భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యాలయంలో నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో భాజపా రాష్ట్ర కార్యాలయ కార్యక్రమ ఇన్ ఛార్జ్ డీ.గోపాల్, డీ.సీ.శేఖర్, సుధాకర్ రెడ్డి, విజయ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి గురువారం బస్ డేగా పాటించాలి : సజ్జనార్

న్యూఢిల్లీ, డిసెంబర్ 9:తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థలోని పరిపాలన విభాగపు అధికారులు, ఉద్యోగులు ప్రతి గురువారం బస్ డే గా పాటించి, ఆ రోజు టీయస్‌ఆర్టీసీ బస్ లలోనే ప్రయాణించాలని టీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ వీ.సీ.సజ్జనార్, ఐ.పి.యస్ ఆదేశాలు జారీ చేశారు. ఈరోజు తాను స్వయంగా తన నివాస గృహం నుండి లడ్డీకపూల్ మీదుగా టెలిఫోన్ భవన్ వరకు కాలినడకన వచ్చి టెలిఫోన్ భవన్ బస్టాప్ లో మెహిదీపట్నం డిపోకు చెందిన 113/ఐ/యం బస్సులో టికెట్ కొనుక్కొని తాను పనిచేస్తున్న కార్యాలయానికి (బస్ భవన్) ప్రయాణం చేశారు. తానెవరో తెలుపకుండా టెలిఫోన్ భవన్ బస్టాప్ లో తనతో పాటు అక్కడ ఉన్న ప్రయాణికులతో ముచ్చటించారు.

ముఖ్యంగా బస్సుల సమయపాలన, సిబ్బంది ప్రవర్తన, పనితీరు, బస్సుల్లో శుభ్రత, సౌకర్యాలు, కార్గో సేవల గురించి వారి అభిప్రాయాలూ స్వయంగా తెలుసుకున్నారు. అలాగే ప్రయాణీకులు, విద్యార్థినీ విద్యార్థులతో మాట్లాడి వారి అభిప్రాయాలు, సూచనలు, సలహాలు ప్రత్యక్షంగా స్వీకరించారు. తాను పనిచేస్తున్న కార్యాలయానికి చేరుకున్న తరువాత బస్ డ్రైవర్, కండక్టర్ ను అభినందిస్తూ వారు స్టేజీల వద్ద రూటు వివరాలు గట్టిగా అరచి చెప్పడం, అలాగే డ్రైవర్ చక్కగా బస్ ను నడిపి సురక్షితంగా సౌకర్యవంతంగా తన ప్రయాణం సాగడానికి సహకరించినందుకు వారికి కృతజ్ఞతలు తెలియజేశారు. బస్ ప్రయాణం సురక్షితమని, సౌకర్యవంతమని, చౌకైనదని, అలాగే కాలుష్యాన్ని నియంత్రించడానికి ఆర్టీసీ బస్సులోనే ప్రయాణించి సంస్థ అభ్యున్నతికి తమవంతు సహకారం అందించాలని ప్రజలకు, ప్రయాణికులకు విజ్ఞప్తి చేశారు. సంస్థ మనుగడకు ప్రయాణికుల ఆదరణ ముఖ్యమని సంస్థ అధికారులు, ఉద్యోగులు ప్రతి గురువారం బస్ డే పాటించి బస్సులోనే ప్రయాణించడం ద్వారా ప్రయాణికుల అభిప్రాయాలూ, అవసరాలు, వారికి కావలసిన సేవల గురించి తెలుసుకొనే వీలు కలుగుతుందని, తద్వారా తగిన చర్యలు చేపట్టి సంస్థను అభివృద్ధి పథంలో నడిపించాలనే ఉద్దేశంతో సంస్థ ఎండీ సజ్జనార్ ఈ కీలక నిర్ణయం తీసుకున్నారు.

బ్యాటరీ స్టోరేజీకు సంబంధించిన పిఎల్ఐ పథకంపై అంతర్ మంత్రిత్వ శాఖ సమావేశానికి అధ్యక్షత వహించిన విద్యుత్ మంత్రి అధ్యక్షత వహించారు

న్యూఢిల్లీ, డిసెంబర్ 9:కేంద్ర విద్యుత్ మరియు ఎంఎన్ఆర్ఈ మంత్రి శ్రీ ఆర్.కె. సింగ్ అధ్యక్షతన పిఎల్ఐ స్కీమ్‌పై అడ్వాన్స్‌డ్ కెమిస్ట్రీ సెల్ బ్యాటరీ స్టోరేజ్ మరియు విదేశాలలో లిథియం గనులను కొనుగోలు చేసే వ్యూహంపై నిన్న సాయంత్రం ఇక్కడ ఒక ఇంటర్ మినిస్టీరియల్ సమావేశం జరిగింది. గనుల మంత్రిత్వ శాఖ, బొగ్గు మంత్రిత్వ శాఖ, భారీ పరిశ్రమల మంత్రిత్వ శాఖ, ఎంఈఏ, నీతి అయోగ్, విద్యుత్ శాఖకు చెందిన ఉన్నతాధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

భారీ పరిశ్రమల మంత్రిత్వ శాఖ ద్వారా పిఎల్ఐ పథకంపై బిడ్‌ల స్థితిగతులను మంత్రి తెలియజేశారు. మరియు పిఎల్ఐ బిడ్ ప్రక్రియలను వేగవంతం చేయాలని ఆదేశించారు. ప్రపంచంలో లిథియం నిల్వల లభ్యతపై ఆయన మరింత చర్చించారు. లిథియం గనులను భారతదేశం అన్వేషించగల సంభావ్య ప్రదేశాలను ఆయన సమీక్షించారు. గనులను సేకరించే ప్రక్రియ మరియు యంత్రాంగం వివిధ దేశాలలో మారుతూ ఉంటాయి మరియు తదనుగుణంగా మనం సిద్ధం కావాలని తెలిపారు.

ఇంధన అవసరాల పరంగా భారతదేశం చాలా పెద్ద దేశమని అందువల్ల బ్యాటరీ నిల్వ కోసం మన అవసరం కూడా భారీగా ఉందని మంత్రి తెలిపారు. 2030 నాటికి 120 జిడబ్లూహెచ్‌గా అంచనా వేయబడిందని, మన 500 జిడబ్లూ పునరుత్పాదక సామర్థ్యానికి తోడ్పడుతుందని మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. మన ఆర్ఈ లక్ష్యాలను దృష్టిలో ఉంచుకుని భవిష్యత్తు అవకాశాలు మరియు దీర్ఘకాలిక ప్రణాళికల గురించి ఆయన మరింత చర్చించారు.

బీఈఈ 31వ నేషనల్ ఎనర్జీ కన్జర్వేషన్ అవార్డ్స్, నేషనల్ ఎనర్జీ ఎఫిషియెన్సీ ఇన్నోవేషన్స్ అవార్డులు

న్యూఢిల్లీ, డిసెంబర్ 9:కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ మార్గదర్శకత్వంలోని బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియెన్సీ, జాతీయ ఇంధన పరిరక్షణ దినోత్సవం సందర్భంగా నేషనల్ ఎనర్జీ కన్జర్వేషన్ అవార్డ్స్ (ఎన్ఈసీఏ) కార్యక్రమాన్ని నిర్వహిస్తుంది. ఇంధన వినియోగాన్ని తగ్గించుకున్న పారిశ్రామిక యూనిట్లు, సంస్థలు సంస్థల ప్రయత్నాలను ఈ సందర్భంగా ప్రోత్సహిస్తుంది. ప్రతి సంవత్సరం డిసెంబర్ 14న అవార్డులను అందజేస్తారు.

ఈ సంవత్సరం, నేషనల్ ఎనర్జీ ఎఫిషియెన్సీ ఇన్నోవేషన్ అవార్డ్స్ (ఎన్ఈఈఐఏ) పేరుతో మరో అవార్డు కూడా ఇస్తారు. ఈ సంవత్సరం "ఆజాదీ కా అమృత్ మహోత్సవ్"లో భాగంగా ఎన్ఈసీఏ, ఎన్ఈఈఐఏ అవార్డుల కార్యక్రమాలను నిర్వహిస్తున్నాయి. నేషనల్ ఎనర్జీ కన్జర్వేషన్ అవార్డ్స్, నేషనల్ ఎనర్జీ ఎఫిషియెన్సీ ఇన్నోవేషన్ అవార్డ్స్ అవార్డు గ్రహీతలను 14 డిసెంబర్ 2021న జాతీయ ఇంధన సంరక్షణ దినోత్సవం సందర్భంగా ప్రముఖులు సత్కరిస్తారు. ఇంధన వినియోగాన్ని తగ్గించడంతోపాటు అసాధారణ విజయాలు సాధించినందుకు వివిధ రంగాలకు చెందిన యూనిట్లకు జాతీయ ఇంధన పరిరక్షణ అవార్డులను ఇస్తారు. ఎన్ఈసీఏ (2021) అవార్డులను పరిశ్రమ, రవాణా, భవనం, సంస్థ, ఉపకరణాల కేటగిరీల్లో ఇస్తారు. వీటికోసం ఆన్‌లైన్ దరఖాస్తులను ఆహ్వానించారు. వీటిని 30 విభాగాలుగా విభజించారు. ఎన్ఈసీఏ 2021 అవార్డుల కోసం ముగింపు తేదీ వరకు మొత్తం 408 దరఖాస్తుదారులు అందాయి. 14 డిసెంబర్ 2021న నిర్వహించే నేషనల్ ఎనర్జీ కన్జర్వేషన్ సందర్భంగా అవార్డులతో సత్కరిస్తారు. అవార్డు గ్రహీతలను పవర్ సెక్రటరీ అధ్యక్షతన నియమించిన అవార్డ్ కమిటీ ఖరారు చేసింది.

ఈ సంవత్సరం, నేషనల్ ఎనర్జీ కన్జర్వేషన్ అవార్డ్ (ఎన్ఈసీఏ) కాకుండా, విద్యుత్ మంత్రిత్వ శాఖ నేషనల్ ఎనర్జీ ఎఫిషియెన్సీ ఇన్నోవేషన్ అవార్డ్ (ఎన్ఈఈఐఏ)ని కూడా ప్రారంభించింది. ఇది "ఇన్నోవేటివ్ ఎనర్జీ ఎఫిషియెన్సీ టెక్నాలజీస్"ని గుర్తించడానికి, పరిశ్రమలు ఉ రంగాలు తమ యూనిట్లలో వినూత్న ఇంధన సామర్థ్య ప్రయత్నాలను అభివృద్ధి చేసేలా ప్రోత్సహించడానికి, పోటీ భావాన్ని పెంచడానికి ఏర్పాటైన అవార్డు. కేటగిరీ ఏ (పరిశ్రమ, రవాణా, భవనం) ఉ కేటగిరీ బీ (స్టూడెంట్స్ ఉ రీసెర్చ్ స్కాలర్స్) నుండి ఆన్‌లైన్ దరఖాస్తులను ఆహ్వానించారు.. ఎన్ఈఈఐఏ 2021 పురస్కారాల కోసం చివరి తేదీ నాటికి మొత్తం149 మంది దరఖాస్తుదారులు అందజేశారు. ఎనర్జీ ఎఫిషియెన్సీ ఇన్నోవేషన్ అవార్డ్ ..కొత్త సాంకేతికతలను, ఆలోచనలను, ఆవిష్కరణలను ప్రోత్సహించడానికి అవసరం. ఇంధన పొదుపు సామర్థ్యాన్ని సాధించడానికి పరిశోధన ఉ అభివృద్ధిపై ఎక్కువ దృష్టి పెట్టడానికి కొత్త పద్ధతులను అమలు చేయడాన్ని ప్రోత్సహిస్తుంది. తక్కువ వ్యవధిలో గణనీయమైన మార్పులను తీసుకురావడానికి కొత్త ఉపాధి అవకాశాల కోసం ఒక మార్గాన్ని సృష్టించగల సామర్థ్యం ఆవిష్కరణలకు ఉంటుంది.

శక్తి సామర్థ్యం, పునరుత్పాదక శక్తిని ప్రోత్సహించడం వల్ల కార్బన్ ఉద్గారాల లక్ష్యాలను సాధించవచ్చు. ఇందుకోసం వివిధ భాగస్వాములు చేపట్టిన అటువంటి ప్రయత్నాలను గుర్తించాలి. పరివర్తనను వేగవంతం చేయడానికి ప్రోత్సహకాలు ఇవ్వాలి. దీని ఫలితాలు చివరికి భారతదేశం జాతీయంగా నిర్ణయమైన చేయూతలు (ఎన్డీసీలు), విస్తృత వాతావరణ లక్ష్యాలను చేరుకోవడానికి దోహదం చేస్తాయి.

'ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ డెమోక్రసీ అండ్ ఎలక్టోరల్ అసిస్టెన్స్' (ఐడీఈఏ) సలహాదారుల బోర్డులో చేరిన మాజీ సీఈసీ శ్రీ సునీల్ అరోరా

న్యూఢిల్లీ, డిసెంబర్ 9:'ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ డెమోక్రసీ అండ్ ఎలక్టోరల్ అసిస్టెన్స్' (ఐడీఈఈ) సలహాదారుల బోర్డులో చేరడానికి భారత మాజీ చీఫ్ ఎలక్షన్ కమిషనర్ శ్రీ సునీల్ అరోరాను ఐడీఈఏ సలహాదారుల బోర్డులో ఆహ్వానించబడ్డారు. శ్రీ సునీల్ అరోరా గొప్ప నాయకత్వ అనుభవాన్ని, విజ్ఞానాన్ని మరియు నైపుణ్యాలు అంతర్జాతీయ సంస్థ యొక్క పనికి గణనీయంగా తోడ్పడుతాయి.

శ్రీ సునీల్ అరోరా అనేక రకాల నేపథ్యాల నుండి ప్రముఖ వ్యక్తులు, నిపుణులైన 15-సభ్యుల సలహాదారుల బోర్డు ద్వారా ఇన్‌స్టిట్యూట్‌కు తోడ్పాటు అందుతుంది. 'ఇంటర్నేషనల్ ఇన్స్టిట్యూట్ ఫర్ డెమోక్రసీ అండ్ ఎలక్టోరల్ అసిస్టెన్స్' (ఇంటర్నేషనల్ ఐడీఈఏ), 1995లో స్థాపించబడింది. ఇది ప్రపంచవ్యాప్తంగా స్థిరమైన ప్రజాస్వామ్యానికి మద్దతు ఇచ్చే లక్ష్యంతో స్వీడన్‌లోని స్టాక్‌హోమ్‌లో ఏర్పాటు చేశారు. ఇది ఒక అంతర్ ప్రభుత్వ సంస్థ. అంతర్జాతీయ ఐడీఈఈ ప్రస్తుతం 34 సభ్య దేశాలను కలిగి ఉంది, ఇందులో అన్ని ఖండాల నుండి పెద్ద మరియు చిన్న, పాత మరియు కొత్త ప్రజాస్వామ్య దేశాలు ఉన్నాయి. ఐడీఈఏ

వ్యవస్థాపక సభ్యులలో భారతదేశం ఒకటి. శ్రీ సునీల్ అరోరా 2 డిసెంబర్ 2018 నుండి ఏప్రిల్ 12, 2021 వరకు భారతదేశ 23వ ప్రధాన ఎన్నికల కమిషనర్‌గా వ్యవహరించారు. శ్రీ అరోరా 1 సెప్టెంబర్ 2017న భారత ఎన్నికల కమిషనర్‌గా ఈసీఐలో చేరారు.

ఈసీఐలో శ్రీ సునీల్ అరోరా 42 నెలలకు పైగా పని చేశారు. ఈయన పదవీ కాలంలో భాగంగా ఉన్న.. 2019లో 17వ లోక్‌సభకు సాధారణ ఎన్నికలు జరిగాయి. 24 రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలతో పాటుగా ఉప ఎన్నికలు, ద్వైవార్షిక ఎన్నికలు కూడా చాలా విజయవంతంగా నిర్వహించబడినాయి.

శ్రీ అరోరా, 1980 బ్యాచ్ 'ఇండియన్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్' (ఐఏఎస్) అధికారి, ఇంతకు ముందు భారత ప్రభుత్వం ఉ రాజస్థాన్ రాష్ట్ర ప్రభుత్వంలో వివిధ కీలక విభాగాలకు నాయకత్వం వహించారు. శ్రీ సునీల్ అరోరా నాయకత్వంలో ఈసీఐ తన డిజిటల్ ప్రోగ్రామ్‌కు 930 మిలియన్ల కంటే ఎక్కువ మంది ఓటర్లతో కూడిన ఏకీకృత డేటాబేస్‌ను తయారు చేశారు. దేశవ్యాప్తంగా హెల్ప్‌లైన్ 1950ని సృష్టించడం ద్వారా పెద్ద తోడ్పాటును అందించింది. పౌరుల జాగృతికి గాను సహాయపడే మరో సాంకేతిక ఆవిష్కరణ - సీవిజిల్ యాప్ ఒక గొప్ప సాధనంగా మారింది, ఇది మోడల్ ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించిన కేసులను నివేదించడానికి ఎన్నికలకు వెళ్లే ప్రాంతాల్లోని పౌరులను అనుమతిస్తుంది. సీనియర్ సిటిజన్లు మరియు వికలాంగులు తమ ఇండ్ల నుండి ఓటు వేయడానికి పోస్టల్ బ్యాలెట్ సౌకర్యాన్ని కల్పించడంలో శ్రీ అరోరా చూపిన వ్యక్తిగత చొరవ చాలా ప్రశంసించదగినదిగా ఉంది. ఎన్నికలను అందుబాటులోకి తీసుకు

రావడానికి మరియు అందరినీ కలుపుకొని పోయేలా హామీ ఇవ్వబడిన కనీస సౌకర్యాలకల్పనతో పాటుగా పోలింగ్ స్టేషన్‌లను గ్రౌండ్ ఫ్లోర్‌కు మార్చినట్లు కూడా ఆయన హామీ ఇచ్చారు.

ఎలక్ట్రానికల్ ట్రాన్స్‌మిటెడ్ పోస్టల్ బ్యాలెట్ సర్వీస్ ఓటర్లు తమ పోస్టింగ్ స్థలం నుండి ఓటు వేయడానికి ఉపయోగకరమైన సదుపాయంగా కూడా ఆవిష్కృతమైంది. ఎన్నికల నిర్వహణ సంస్థల మధ్య జ్ఞానాన్ని పంచుకోవడం ద్వారా ప్రపంచ వ్యాప్తంగా ప్రజాస్వామ్యాన్ని మరింత లోతుగా మరియు బలోపేతం చేయాలని ఈసీఐ గట్టిగా విశ్వసిస్తుంది. శ్రీ సునీల్ అరోరా హయాంలో అసోసియేషన్ ఆఫ్ వరల్డ్ ఎలక్షన్ బాడీస్ (ఏడబ్ల్యుఈబీ) మరియు ఫోరమ్ ఆఫ్ ఎలక్షన్ మేనేజ్‌మెంట్ బాడీస్ ఆఫ్ సౌత్ ఏషియా (ఎఫ్ఈఎంబీఓఎస్ఏ) చైర్మన్‌గా పనిచేసినప్పుడు, ఈసీఐ సామర్థ్య నిర్మాణాన్ని మరింత మెరుగుపరిచేలా చేసింది. క్యుమెంటేషన్, పరిశోధన మరియు శిక్షణ కోసం న్యూ ఢిల్లీ నగరంలోని ఇండియా ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డెమోక్రసీ అండ్ ఎలక్షన్ మేనేజ్‌మెంట్‌లో సభ్యుని ఈఎంబీల మధ్య ఉత్తమ అభ్యాసాలు మరియు సామర్థ్యాన్ని పెంపొందించడం కోసం ఏ-వెబ్ కేంద్రం ఏర్పాటు చేయబడింది

అవినీతి నిర్మూలనలో యువతదే కీలక పాత్ర

కర్నూలులోని డిగ్రీ కళాశాలలో యూత్ ఫర్ యాంటీ కరప్షన్ ఆధ్వర్యంలో ప్రపంచ అవినీతి వ్యతిరేక దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా యాక్ రాయలసీమ అడ్వైజర్ కె.వేణుగోపాల్ గారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలోని అవినీతి నిర్మూలనకై యువత పాటుపడాలని పిలుపునిచ్చారు. యువతపైన దేశ భవిష్యత్తు ఆధారపడి ఉందన్నారు. అవినీతి పెరిగిపోవడం వల్ల అభివృద్ధి అనేది కుంటుపడుతుందన్నారు. దేశంలో ఉన్న అవినీతి నిర్మూలనలో యువత కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. అవినీతి నిర్మూలన విషయమై సమాజంలో మార్పు రావాలన్న ఆయన.. అప్పుడే అవినీతిని అంతం చేయగలమని అభిప్రాయపడ్డారు.

గని కార్మికులకు ఆరోగ్య మరియు సంక్షేమ చర్యలు

న్యూఢిల్లీ, డిసెంబర్ 9:గనులలో పనిచేసే కార్మికుల భద్రత, ఆరోగ్యం మరియు సంక్షేమం..గనుల చట్టం, 1952 మరియు దాని క్రింద రూపొందించబడిన నియమాలు/నిబంధనల ద్వారా నియంత్రించబడతాయి. వీటిని కార్మిక మరియు ఉపాధి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ (డిజిఎంఎస్) నిర్వహిస్తుంది. ఈ చట్టం మరియు దాని క్రింద రూపొందించబడిన నియమాలు మరియు నిబంధనలు గనులలో వృత్తిపరమైన వ్యాధులను నివారించడానికి, ఉద్యోగానికి ముందు వైద్య పరీక్ష, 5 సంవత్సరాల వ్యవధిలో కాలానుగుణ వైద్య పరీక్ష, వ్యక్తిగత రక్షణ సామగ్రి మరియు వృత్తిపరమైన ఆరోగ్య సర్వే వంటి వాటిని నిరోధించడానికి నిబంధనలను కలిగి ఉన్నాయి.

ఈ చట్టం ప్రకారం మెటాలిఫెరస్ మైన్స్ రెగ్యులేషన్, 1961లోని రెగ్యులేషన్ 124 ప్రకారం కార్యాలయంలోని గాలిలో ధూళిని నిరోధించడం మరియు ఉత్పత్తి చేయడంపై ఇంజనీరింగ్ నియంత్రణ చర్యలు అందించబడ్డాయి. పేర్కొన్న నిబంధన ప్రకారం మైనర్లు వాటిని తగ్గించడానికి అవసరమైన చర్యలను తీసుకోవాలి. ధూళి ఉద్గారాలు మరియు భూమి క్రింద లేదా ఉపరితలంపై ఏదైనా పని ప్రదేశంలో గాలిలోకి ప్రవేశించే ధూళిని అణిచివేసేందుకు మరియు కార్మికులు శ్వాసక్రియ ధూళికి గురికావడం సహేతుకమైన ఆచరణీయమైన పరిమితికి పరిమితం చేయబడిందని నిర్ధారించుకోవడం కోసం కానీ ఏ సందర్భంలోనైనా పరిమితులను మించకూడదు. ధూళిని దాని విడుదల/సంచితం కాకుండా నిరోధించడానికి దాని ఏర్పడే మూలానికి వీలైనంత దగ్గరగా తగ్గించబడాలని మరియు డ్రిల్లింగ్ లేదా బోరింగ్ ఆపరేషన్‌లో వాతావరణంలో ధూళిని ఛార్జ్ చేయకుండా నిరోధించడానికి ఒక జెట్ నీటిని ఉపయోగించాలని కూడా ఇది తెలుపుతుంది.

రాష్ట్ర ప్రభుత్వాలు గనులు మరియు ఖనిజాల (డెవలప్‌మెంట్ అండ్ రెగ్యులేషన్) (ఎంఎండీఆర్) చట్టం, 1957లోని నిబంధనల ప్రకారం ఖనిజ రాయితీలను మంజూరు చేస్తాయి. వేలం ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేసిన తర్వాత విజయవంతమైన బిడ్డర్ చట్టబద్ధమైన అనుమతులు పొందడం తప్పనిసరి. లీజు దస్తావేజుపై సంతకం చేసే మైనింగ్ ఆపరేషన్ చేపట్టే ముందు పర్యావరణం పర్యావరణ క్లియరెన్స్ భూమి, గాలి మరియు

ప్రాజెక్టులు, రిజర్వాయర్ల భద్రతపై సీఎం కీలక ఆదేశాలు

అమరావతి, డిసెంబర్ 9:రాష్ట్రంలో వివిధ నీటి ప్రాజెక్టులు, రిజర్వాయర్ల భద్రత, నిర్వహణపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సీఎం వైయస్.జగన్ ఆదేశించారు. రాష్ట్రంలోని అన్ని ప్రాజెక్టుల వద్ద సమగ్ర పరిశీలన చేయాలని అధికారులక ఆదేశించారు. ప్రాజెక్టులు, రిజర్వాయర్ల వద్ద నిర్వహణా పరిస్థితులు సరిదిద్దాలని, రాష్ట్ర విభజన నాటినుంచి దీనిగురించి పట్టించుకోలేదన్నారు. దీనివల్ల ముప్పు ఏర్పడే పరిస్థితులు రాకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రాజెక్టులు, రిజర్వాయర్ల వారీగా నిర్వహణ కోసం తగినంత సిబ్బంది ఉన్నారా? లేదా? అన్నదానిపై లెక్కలు తీయాలన్నారు. అవసరమైన సిబ్బందిని నియమించాలని ఆదేశాలు జారీచేశారు.

గత సమీక్షా సమావేశంలో ఇచ్చిన ఆదేశాల మేరకు ఈ దిశగా ప్రభుత్వ యంత్రాంగం కొన్ని చర్యలు చేపట్టిందని అధికారులు సీఎంకు వివరించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అధ్యక్షతన జవనరులశాఖ స్పెషల్‌చీఫ్ సెక్రటరీ, రెవిన్యూ?విపత్తు నిర్వహణ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, జలవనరులశాఖ ఇంజినీర్‌ఇన్ ఛీఫ్‌లతో కమిటీని ఏర్పాటుచేసిన విషయాన్ని ముఖ్యమంత్రికి తెలియజేశారు. ఐఐటీ, జేఎన్‌టీయూ నిపుణుల కమిటీకి జలవనరులశాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్ ఛైర్మన్‌గా ఉన్నారని, తీసుకోవాల్సిన చర్యలను అత్యున్నత కమిటీకి తెలియజేస్తున్నారని వివరించారు.

సీఎం ఇచ్చిన ఆదేశాల మేరకు వివిధ?ప్రాజెక్టులు, నిర్వహణలపై గత ప్రభుత్వాల హయాంలో ఇచ్చిన నివేదికలను కూడా అత్యున్నతస్థాయి కమిటీ పరిశీలిస్తోందన్నారు.తాజా వచ్చిన వరదలను, కుంభ వృష్టిని పరిగణలోకి తీసుకుని ఆమేరకు తగిన సూచనలు చేస్తుందన్నారు. ఆటోమేషన్ రియల్‌టైం డేటాకూ కమాండ్ కంట్రోల్ రూంకు అనుసంధానించే వ్యవస్థపైనాకూడా చీఫ్ సెక్రటరీతో కూడిన అత్యున్నత బృందం దృష్టిసారించిందని ముఖ్యమంత్రికి వివరించారు. అన్ని మేజర్, మీడియం రిజర్వాయర్లు, బ్యారేజీల నిర్వహణకు అదనపు సిబ్బంది నియామకం, అలాగే వాటర్ రెగ్యులేషన్‌కోసం కూడా సిబ్బంది నియామకంపై ప్రతిపాదనలు సిద్ధమయ్యాయని అధికారులు తెలియజేశారు. వీరి నియామకానికి తగిన చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు.

ఒమిక్రాన్‌పై నిర్లక్ష్యం వద్దు.. నివారణ చర్యలు వేగవంతం చేయాలి: డబ్ల్యూహెచ్‌వో

న్యూఢిల్లీ, డిసెంబర్ 9:నివారణ చర్యలు చేపట్టకుంటే కరోనా కొత్త వేరియంట్ ఒమిక్రాన్ మహమ్మారిగా మార్పు చెందవచ్చని ప్రపంచ ఆరోగ్య సంస్థ హెచ్చరించింది. వీలైనంత త్వరగా వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని పూర్తి చేయడంతో పాటు వ్యాప్తి చెందకుండా ప్రజలను రక్షించడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని అన్ని దేశాలకు పిలుపునిచ్చింది. ఒమిక్రాన్ వేరియంట్ ప్రపంచ సంక్షోభంగా మారకుండా అడ్డుకోవాలని డబ్ల్యుహెచ్ఒ డైరెక్టర్ జనరల్ టెడ్రోస్ పేర్కొన్నారు. ఈ వైరస్ రూపాంతరం చెందుతున్నా.. అడ్డుకట్టవేయాలనే మన సంకల్పం మాత్రం దృఢంగా ఉండాలన్నారు. డెల్టా వేరియంట్ కన్నా ఒమిక్రాన్ తేలికపాటిదేనని ప్రాథమిక నివేదికలు సూచిస్తున్నప్పటికీ.. ఇప్పటికిప్పుడే నిర్ధారణకు రాలేమని అన్నారు.

ఒమిక్రాన్ లక్షణాలు, అన్ని దేశాలకు వేగంగా వ్యాప్తి చెందుతున్న తీరు, అతి పెద్ద సంఖ్యలో ఉత్పరివర్తనాలు కలిగి ఉండటంతో తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉన్నట్లు సూచిస్తోందని టెడ్రోస్ అన్నారు. ఒమిక్రాన్ వేరియంట్ వ్యాప్తి చెందకుండా నిరోధించేందుకు వ్యాక్సిన్ మూడో డోసు అవసరమని అధ్యయనాలు సూచిస్తున్నాయని ఫైజర్, బయోటెక్ సంస్థలు ప్రకటించిన సంగతి తెలిసిందే. ప్రపంచవ్యాప్తంగా బూస్టర్ డోసులను వేగవంతం చేయాల్సిన అవసరం ఉందని వారి విశ్లేషణలు పేర్కొంటున్నాయి. వ్యాక్సినేషన్ రేటు తక్కువగా ఉన్న పేద దేశాలకు మరిన్ని వ్యాక్సిన్‌లను అందుబాటులోకి తీసుకువచ్చేందుకు గాను కొద్ది కాలం పాటు బూస్టర్ డోసులను నిలిపివేయాల్సి వుందని డబ్ల్యుహెచ్ఒ వాదిస్తోంది. అయితే ఒమిక్రాన్ నుండి రక్షణ పొందేందుకు బూస్టర్ డోస్ అవసరమని శాస్త్రవేత్తలు నిర్ధారిస్తుండటంతో పలుదేశాలు ఆ దిశగా అడుగులు వేసే అవకాశాలు కూడా లేకపోవచ్చని తెలుస్తోంది.

బస్తీ దవాఖానలతో అందరికి ఆరోగ్యం : మంత్రి మల్లారెడ్డి

మేడ్చల్ మల్కాజిగిరి, డిసెంబర్ 9:: బస్తీ దవఖానలతో ప్రతి ఒక్కరికి నాణ్యమైన వైద్య సేవలు అందుతాయని కార్మిక శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి తెలిపారు. జిల్లాలోని ఘటకేసర్ మున్సిపాలిటీ బాలాజీ నగర్‌లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన బస్తీ దవఖానను గురువారం మంత్రి ప్రారంభం చేశారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ..బస్తీ ప్రజలందరికి వైద్య సేవలను అందుబాటులోకి తీసుకకావాలనే సంకల్పతో సీఎం కేసీఆర్ బస్తీ దవఖానలకు శ్రీకారం చుట్టి అమలు చేస్తున్నారని అన్నారు.

దశల వారీగా అన్ని ప్రాంతాల ప్రజలకు ఈ బస్తీ దవఖానల సేవలు ప్రభుత్వ ఆధ్వర్యంలో అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు.

వీటిలో అర్హత గల వైద్యులు, సిబ్బంది, అన్ని రకాల మందులు అందుబాటులో ఉంటాయని వివరించారు. అనంతరం మంత్రి మల్లారెడ్డి బస్తీ దవఖానలో షుగర్,బి.పి పరిక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్ఓ మల్లికార్జునరావు, వైస్ చైర్మన్ మాధవ రెడ్డి, కౌన్సిలర్లు, టీఆర్ఎస్ నాయకులు శ్రీనివాస్ గౌడ్, రాధాకృష్ణ, ఎం.జంగయ్య యాదవ్ పాల్గొన్నారు.

శబరిమలకు ప్రత్యేక రైళ్లు.. సౌత్ సెంట్రల్ రైల్వే ప్రకటన

హైదరాబాద్, డిసెంబర్ 9: పండుగలను, భక్తులను దృష్టిలో ఉంచుకుని శబరిమలకు ప్రత్యేక రైళ్లు నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే ప్రకటించింది. ఈ ప్రత్యేక రైళ్లు సికింద్రాబాద్ – కొల్లాం మధ్య అందుబాటులో ఉండనున్నాయి. డిసెంబర్ 17న సికింద్రాబాద్ నుంచి కొల్లాం స్టేషన్‌కు 07109 నంబర్ గల రైలు బయల్దేరనుంది. కొల్లాం నుంచి సికింద్రాబాద్‌కు డిసెంబర్ 19న 07110 నంబర్ గల రైలు బయల్దేరనుంది. 07109 నంబర్ గల రైలుకు రిజర్వేషన్ల ప్రక్రియ డిసెంబర్ 10న ఉదయం 8 గంటలకు ప్రారంభం కానుంది.

ఈ ప్రత్యేక రైళ్లు చర్లపల్లి, జనగామ, కాజీపేట, వరంగల్, మహబూబాబాద్, డోర్నకల్, ఖమ్మం, విజయవాడ, తెనాలి, చీరాల, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, రేణిగుంట, కట్పడి, జోలార్‌పెట్టై, సేలం, ఈరోడ్, కోయంబత్తూర్, పాలక్కడ్, త్రిశూర్, ఎర్నాకులం, కొట్టాయం, చెంగన్‌చెరి, తిరువల్ల, చెంగనూరు, మావలికర, కయాంకులం స్టేషన్ల మీదుగా వెళ్లనున్నాయి.

కేన్-బేట్ వా నదుల అనుసంధానం పథకానికి ఆమోదం

న్యూఢిల్లీ, డిసెంబర్ 9:కేన్–బేట్ వా నదుల అనుసంధాన పథకాని కి ఆర్థిక సహాయాన్ని అందించడంతో పాటు, ఆ పథకం అమలుకు ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ అధ్యక్షతన ఈ రోజు న సమావేశమైన కేంద్ర మంత్రి మండలి ఆమోదం తెలిపింది.

కేన్–బేట్ వా లింక్ ప్రాజెక్టు కు అయ్యే మొత్తం ఖర్చు ను 2020–21 ధరల స్థాయిల ను బట్టి చూస్తే 44,605 కోట్ల రూపాయలు గా మదింపు చేయడమైంది. ఈ పథకాని కి 36,290 కోట్ల రూపాయల ను గ్రాంటు రూపం లోను, 3,027 కోట్ల రూపాయల ను రుణం రూపం లోను ఇవ్వడానికి.. ఈ విధం గా 39,317 కోట్ల రూపాయల ను కేంద్రం పక్షాన మద్దతు ఇవ్వడానికి కేంద్ర మంత్రి ఆమోదం తెలిపింది.

ఈ పథకం భారతదేశం లో మరిన్ని నదుల అనుసంధాన పథకాల కు బాటను పరచనుంది. అంతేకాదు, ప్రపంచాని కి మన యొక్క కార్యకుశలత ను మరియు దృష్టి కోణాన్ని చాటి చెబుతుంది.

ఈ పథకం లో భాగం గా దౌధాన్ ఆనకట్ట ను నిర్మించడం తో పాటు, దిగువ ఓర్ పథకం, కోటా బేరాజు, అలాగే బీనా కాంప్లెక్స్ బహుళార్థసాధక పథకాల ను కలుపుతూ కాలువ ను నిర్మించడం ద్వారా కేన్ నుంచి జలాలను బేట్ వా నది లోకి బదలాయించడం జరుగుతుంది. ఈ పథకం 10.62 లక్షల హెక్టేర్ల భూమి కి ఏటా సేద్యపు నీటి ని సమకూర్చడం తో పాటు, సుమారు గా 62 లక్షల మంది కి తాగునీటి ని సరఫరా చేస్తుంది. దీనికి తోడు 103 ఎమ్ డబ్ల్యు జలవిద్యుత్తు ను, ఇంకా 27 ఎమ్ డబ్ల్యు సౌర విద్యుత్తు ను కూడా ఉత్పత్తి చేసేందుకు వీలవుతుంది. ఈ పథకాన్ని అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం అండదండల తో 8 సంవత్సరాల లో అమలు చేయాలని ప్రతిపాదించడమైంది.

ఈ పథకం నీటి కోసం అల్లాడుతున్న మధ్య ప్రదేశ్, ఇంకా ఉత్తర్ ప్రదేశ్ రాష్ట్రాల లో విస్తరించి ఉన్నటువంటి బుందేల్ ఖండ్ ప్రాంతాని కి గొప్ప లబ్ధి ని చేకూర్చనుంది. ఈ పథకం మధ్య ప్రదేశ్ లో పన్నా, టీకమ్ గఢ్, ఛాతర్ పుర్, సాగర్, దమోహ్, దతియా, విదిశా, శివపురి, ఇంకా రాయ్ సేన్ జిల్లాల తో పాటు, ఉత్తర్ ప్రదేశ్ లోని బాందా, మహోబా, ఝాంసీ మరియు లలిత్ పుర్ జిల్లాల కు పెద్ద ఎత్తున ప్రయోజనకారి కాగలదు.

ఈ పథకం వెనుకబడినటువంటి బుందేల్ ఖండ్ ప్రాంతం లో వ్యావసాయిక కార్యకలాపాల ను పెంచడం తో పాటు, ఉపాధి కల్పన కు అస్కారమిచ్చి, ఆ ప్రాంతం లో సామాజిక, ఆర్థిక సమృద్ధి కి దన్ను గా నిలుస్తుందన్న అంచనా ఉంది. ఈ పథకం ఈ ప్రాంతం లో ప్రజలు నిరుత్సాహానికి లోనై ప్రవాసం పాలబడకుండా కూడా తోడ్పడుతుంది.ఈ పథకం పర్యావరణ సంబంధి నిర్వహణ కు మరియు జాగ్రత్త చర్యల కు భారీ ఎత్తున దోహద పడుతుంది. ఈ ఉద్దేశ్యం నెరవేరడం కోసం వైల్డ్ లైఫ్ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ ఇండియా ఒక సంపూర్ణమైనటువంటి ల్యాండ్ స్కేప్ మేనేజ్ మెంట్ ప్లాను ను ఖరారు చేయబోతోంది.

దేశం లో మొట్టమొదటి సారిగా కేంద్రం అండదండల తో ఒక భారీ నదుల అనుసంధాన పథకాన్ని అమలు లోకి తీసుకు రావడం కోసం జలశక్తి శాఖ కేంద్ర మంత్రి, మధ్య ప్రదేశ్, ఇంకా ఉత్తర్ ప్రదేశ్ ల ముఖ్యమంత్రులు ఒక చరిత్రాత్మకమైన ఒప్పంద పత్రం పైన 2021 వ సంవత్సరం మార్చి నెల 22 వ తేదీన సంతకాలు చేశారు. ఈ ఒప్పందం జలాల ను మిగులుగా ఉన్నటువంటి ప్రాంతాల నుంచి కరవు బాధిత ప్రాంతాల కు, జల సౌకర్యం లోపించిన ప్రాంతాల కు తరలించడం కోసం శ్రీ అటల్ బిహారీ వాజ్ పేయీ దార్శనికత ను సాకారం చేయడం కోసం అంతర్ రాష్ట్ర సహకారాన్ని వినియోగించుకోవాలని సంకల్పించింది.

ప్రధానమంత్రి ఆవాస్ యోజన - గ్రామీణ్ (పిఎమ్ఎవై-జి) ని 2021 మార్చి తరువాత నుంచి 2024 మార్చి వరకు కొనసాగించడానికి ఆమోదం

ప్రధానమంత్రి ఆవాస్ యోజన - గ్రామీణ్ (పిఎమ్ఎవై–జి) ని 2021వ సంవత్సరం మార్చి నెల తరువాత సైతం కొనసాగించడం కోసం గ్రామీణ అభివృద్ధి విభాగం తీసుకు వచ్చిన ప్రతిపాదన కు ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ అధ్యక్షతన ఈ రోజు న జరిగిన కేంద్ర మంత్రిమండలి సమావేశం ఆమోదాన్ని తెలిపింది. దీని లో భాగం గా ఈ పథకం లో మొత్తం 2.95 కోట్ల గృహాల ను నిర్మించాలనేది లక్ష్యం గా ఉండగా, 2021 మార్చి 31 నాటికి మిగిలి ఉన్నటువంటి 155.75 లక్షల ఇళ్ళ నిర్మాణాని కి ఆర్థిక సహాయాన్ని సమకూర్చవలసి ఉంది.

మంత్రివర్గం ఆమోదం తాలూకు వివరాలు ఈ కింది విధం గా ఉన్నాయి:

పిఎమ్ఎవై–జి ని 2021 మార్చి తరువాత నుంచి 2024 వ సంవత్సరం మార్చి నెల వరకు కొనసాగించడం, దీనికి గాను మిగిలిపోయిన గృహాల ను పూర్తి చేయడం కోసం ప్రస్తుత నియమాల ప్రకారం ఆ ఇళ్ళ ను నిర్మించడం జరుగుతుంది.

మిగిలిపోయిన 155.75 లక్షల గృహాల నిర్మాణం సంబంధిత ఆర్థిక ప్రభావం 2,17,257 కోట్ల రూపాయలుగా ఉంది (దీనిలో కేంద్రం వాటా 1,25,106 కోట్ల రూపాయలు, రాష్ట్ర వాటా 73,475 కోట్ల రూపాయలు). దీనిలో భాగం గా ఎన్ఎబిఎఆర్ డి (నాబార్డ్) కు వడ్డీ ని తిరిగి చెల్లించడం కోసం 18,676 కోట్ల రూపాయల మేరకు అదనం గా అవసరం.

ఇబిఆర్ ను దశల వారీగా తొలగించడం మరియు యావత్తు పథకాని కి స్థూల బడ్జెటు రూపేణా సమర్థన (జిబిఎస్) ద్వారా సర్దుబాటు చేయడం.. ఈ అంశాల లో ఆర్థిక మంత్రిత్వ శాఖ ను సంప్రదించి నిర్ణయం తీసుకోవలసి ఉంటుంది.

పరిపాలన సంబంధి నిధుల లో కేంద్రం వాటా నుంచి ఏటా అదనం గా 45 లక్షల రూపాయల ను ప్రతి ఒక్క చిన్న రాష్ట్రాని కి విడుదల చేయవలసి ఉంటుంది (2 శాతం మొత్తం పరిపాలన నిధుల లో 0.3 శాతం) ఆ చిన్న రాష్ట్రాలు ఏవేవంటే.. హిమాచల్ ప్రదేశ్, హరియాణా, గోవా, పంజాబ్, ఉత్తరాఖండ్ లతో పాటు, అసమ్ మరియు త్రిపుర లు మినహా ఈశాన్య రాష్ట్రాలు, అలాగే జమ్ము, కశ్మీర్ లు మినహా అన్ని కేంద్రపాలిత ప్రాంతాలు.

ప్రోగ్రామ్ మేనేజ్ మెంట్ యూనిట్ (పిఎమ్ యు) మరియు నేషనల్ టెక్నికల్ సపోర్ట్ ఏజెన్సీ (ఎన్ టిఎన్ఎ) లను 2023–24 ఆర్థిక సంవత్సరం కొనసాగించడం.

ఈ పథకాన్ని 2024 వ సంవత్సరం మార్చి వరకు కొనసాగించడం అనేది పిఎమ్ఎవై–జి లో భాగం గా లక్ష్యం గా నిర్దేశించుకున్న 2.95 కోట్ల గృహాల లో మిగిలిపోయిన 155.75 లక్షల కుటుంబాల కు కనీస సౌకర్యాల తో కూడిన పక్కా ఇళ్ళ నిర్మాణాని కి గాను సహాయాన్ని అందజేయడం జరుగుతుంది. దీని ద్వారా గ్రామీణ ప్రాంతాల లో "అందరికీ గృహ వసతి కల్పన" అనే లక్ష్యాన్ని సాధించడం వీలవుతుంది

2021 సంవత్సరం నవంబర్ 29వ తేదీ నాటికి మొత్తం లక్ష్యం అయినటువంటి 2.95 కోట్ల గృహాల లో నుంచి 1.65 కోట్ల పిఎమ్ఎవై–జి గృహాల ను నిర్మించడం జరిగింది. 2.02 కోట్ల గృహాల ను 2022 వ సంవత్సరం ఆగస్టు 15వ తేదీ గా పెట్టుకొన్న తుది గడువు కల్లా పూర్తి చేయడం జరుగుతుంది. ఈ కారణం గా 2.95 కోట్ల గృహాల మొత్తం లక్ష్యాన్ని సాధించాలి అంటే గనుక ఈ పథకాన్ని 2024 మార్చి నెల వరకు కొనసాగించవలసిన అవసరం ఉంది.

జలజీవన్ మిషన్ కింద కేంద్ర గ్రాంటుగా విడుదల

న్యూఢిల్లీ, డిసెంబర్ 9:దేశవ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతి ఇంటికీ నీటి కుళాయిల కనెక్షన్లు అందించే కార్యక్రమానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం అగ్రప్రాధాన్యం ఇస్తోంది. దీనితో 2019 ఆగస్టునుంచి జలజీవన్ మిషన్ (జె.జె.ఎం.) పథకం రాష్ట్రాల భాగస్వామ్యంతో అమలవుతూ ఉంది. ఈ పథకం అమలుకోసం మణిపూర్ రాష్ట్రంపై దృష్టిని కేంద్రీకరించిన నేపథ్యంలో ఆ రాష్ట్రానికి కేంద్రం తరపు గ్రాంటుగా రూ. 120కోట్లను భారత ప్రభుత్వం విడుదల చేసింది. మరో వైపు జె.జె.ఎం. అమలుకోసం కేంద్రం నిధుల కింద 2021–22 సంవత్సరానకి గాను రూ. 481కోట్లు కేటాయించారు. 2020–21వ సంవత్సరంలో మణిపూర్ కు కేటాయించిన మొత్తానికి ఇది దాదాపు నాలుగు రెట్లు ఉంటుంది.

వచ్చే ఏడాది సెప్టెంబరు వాటికి రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న ప్రతి ఇంటికీ నీటి సరఫరా కనెక్షన్లు అందించాలని మణిపూర్ ప్రభుత్వం సంకల్పించింది. ఇప్పటి వరకూ అందిన సమాచారం ప్రకారం రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న మొత్తం 4.51 ఇళ్లకు గాను, 2.67లక్షల ఇళ్లకు (అంటే 59.2శాతం ఇళ్లకు) నీటి కనెక్షన్లు ఉన్నాయి. 2019వ సంవత్సరంలో జె.జె.ఎం. పథకం ప్రకటించినప్పటినుంచి దాదాపు 2.41లక్షల ఇళ్లకు నీటి కుళాయిల కనెక్షన్లు అందించారు. ఇక 2021–22వ సంవత్సరంలో 2.26లక్షల గ్రామీ ఇళ్లకు నీటి కుళాయిల కనెక్షన్లు అందించాలని మణిపూర్ ప్రభుత్వం యోచిస్తోంది.

2021–22లో 15వ ఆర్థిక సంఘం గ్రాంటు కింద రూ. 78కోట్లను కేటాయించారు. గ్రామీణ స్థానిక సంస్థలు, పంచాయతీ రాజ్ సంస్థలకు నీటిసరఫరా పారిశుద్ధ్యం పనులకోసం ఈ గ్రాంటును కేటాయించారు. దీనికి తోడు,.. ఇక వచ్చే ఐదేళ్లకు గాను అంటే, 2025–26వరకూ ఆ రాష్ట్రంలోని గ్రామీణ స్థానిక పరిపాలనా సంస్థలకు రూ. 414కోట్ల నిధులు అందనున్నాయి. ఈ నేపథ్యంలో గ్రామీణ ఇళ్లకు నీటిసరఫరా కల్పనకు ఎలాంటి నిధుల కొరత రాకుండా చూసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటూ ఉంది. గ్రామీణ ఇళ్లకు నీటి సరఫరా కోసం మణిపూర్ రాష్ట్రంలో చేసే ఈ భారీ పెట్టుబడితో ఆర్థిక కార్యకలాపాలు వేగవంతం కానున్నాయి. అలాగే, గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ఊతం లభిస్తుంది. దీనితో గ్రామాల్లో ఆదాయం సృష్టికి అవకాశాలు కూడా పెరుగుతాయి.

జె.జె.ఎం. పథకాన్ని వికేంద్రీకరణ పద్ధతిలో అమలు చేస్తూ వస్తున్నారు. ఇందుకోసం దిగువస్థాయి స్థానిక పరిపాలనా సంస్థలకు కూడా తగిన ప్రమేయం కల్పిస్తున్నారు. పథకం ప్రణాళిక, అమలు దశలనుంచి నిర్వహణ వరకూ స్థానిక గ్రామీణ సంఘాలకు కీలకపాత్ర ఉండేలా చర్యలు తీసుకున్నారు. ఇందుకోసం గ్రామ నీటి సరఫరా, పారిశుద్ధ్యకమిటీని/పానీ సమితిని మరింత బలోపేతం చేయడం, ఐదేళ్ల గ్రామ కార్యాచరణ ప్రణాళికను గ్రామసభలోనే ఆమోదింపచేయడం వంటి చర్యలను రాష్ట్రప్రభుత్వం తీసుకుంటోంది. దీనితో తమకోసం అమలుచేసే నీటి సరఫరా పథకాలపై సంబంధిత ప్రజాసమూహమే చర్చించేందుకు అవకాశం ఉంటుంది. ఇంటిలోకి నీటిని మోసుకువచ్చే విషయంలో మహిళలదే కీలక పాత్ర కాబట్టి జె.జె.ఎం. పథకం అమలులో మహిళలకు ఎక్కువ ప్రోత్సాహం ఇస్తున్నారు. ఇంకా, ఈ పథకం అమలుకు స్వచ్ఛంద సంస్థలు, స్వయం సహాయక బృందాలు, స్థానిక ప్రభుత్వేతర సంస్థలు తగిన మద్దతు అందించేలా రాష్ట్రం తగిన చర్యలు తీసుకుంది. పథకం గురించి అవగాహన కలిగించడం, సురక్షితమైన నీటి ఆవశ్యతను గురించి తెలియజెప్పడం, గ్రామ నీటి సరఫరా పారిశుద్ధ్య కమిటీలకు, పానీ సమితులకు తగిన మద్దతు అందించడం తదితర కార్యకలాపాల్లో ఈ సంస్థలన్నింటికీ ప్రమేయం కల్పిస్తున్నారు.

ప్రజారోగ్యంపై దృష్టిని కేంద్రీకరించిన ప్రభుత్వం,.. దేశవ్యాప్తంగా నీటి నాణ్యతా పరీక్షల నిర్వహణకోసం 2వేలకుపైగా లేబరేటరీలను సాధారణ ప్రజలకోసం ప్రారంభించింది. దీనితో ప్రజలు తమ నీటి సమూనాల నాణ్యతను నామమాత్రపు ఖర్చుతో ఎప్పుడైనా పరీక్షించుకునేందుకు అవకాశం కలిగింది. మణిపూర్ రాష్ట్రంలో ఇలాంటివి 13 లేబరేటరీలు ఉన్నాయి.

తాగడానికి, మధ్యాహ్న భోజనం వండటానికి, చేతులు కడుక్కోవడానికి, మరుగుదొడ్లలో వినియోగానికి అన్ని పాఠశాలల్లో, అంగన్వాడీ కేంద్రాల్లో కుళాయిల ద్వారా నీరు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నారు. ఇప్పట వరకూ అందిన సమాచారం ప్రకారం మణిపూర్.లో 3,265 పాఠశాలలకు (94.5శాతం), 7,591 అంగన్వాడీ కేంద్రాలకు (95.2శాతం) నీటి కుళాయిల కనెక్షన్లను అందుబాటులోకి తెచ్చారు.

2019వ సంవత్సరంలో జలజీవన్ మిషన్ పథకం ప్రారంభమైనపుడు,..దేశంలోని గ్రామీణ ప్రాంతాల్లో 18.93కోట్ల ఇళ్లలో కేవలం 3.23కోట్ల ఇళ్లకు (17శాతం ఇళ్లకు) మాత్రమే నీటికుళాయిలు ఉన్నాయి. గడిచిన 27 నెలల్లో కోవిడ్ వైరస్ మహమ్మారి సంక్షోభం, లాక్ డౌన్ ఆంక్షల ద్వారా ఎన్ని అడ్డంకులు ఎదురైనప్పటికీ, జలజీవన్ మిషన్ పనులు మాత్రం వేగవంతంగానే జరిగాయి. ఇప్పటికే, గ్రామీణ ప్రాంతాల్లోని 5.39 కోట్ల ఇళ్లకు నీటి కుళాయిల ఏర్పాటయ్యాయి. ప్రస్తుతం మొత్తం 8.63కోట్ల ఇళ్లకు (45శాతం ఇళ్లకు) నీటి కుళాయిలు అందుబాటులోకి వచ్చాయి. గోవా, తెలంగాణ, హర్యానా రాష్ట్రాల్లో, అండమాన్ నికోబార్ దీవులు, పుదుచ్చేరి, దాద్రా నాగర్ హవేళీ, డామన్–డయ్యూ వంటి కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఉన్న పల్లెల్లో ఇళ్లకు, వందకు వందశాతం నీటి కనెక్షన్లు ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు. ప్రస్తుతం,..83 జిల్లాల్లోని ప్రతి ఇంటికీ, 1.24లక్షల పైచిలుకు గ్రామాలకు ఇపుడు కుళాయిల ద్వారా మంచినీరు సరఫరా అవుతోంది.

సబ్.కా సాత్, సబ్.కా వికాస్, సబ్.కా విశ్వాస్, సబ్.కా ప్రయాస్' అంటూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇచ్చిన పిలుపును స్ఫూర్తిగా తీసుకుని, దేశంలో ఎవరికీ నీటి సరఫరా అందని పరిస్థితి ఉండకూడదన్న సంకల్పంతో, ప్రతి ఇంటికీ నీటి కుళాయి కనెక్షన్ అందించాలన్న దీక్షతో ఈ పథకం అమలు చేస్తూ వస్తున్నారు. ప్రస్తుతం దేశంలోని 83 జిల్లాల్లో, లక్షా 27వేల గ్రామాల్లో ఇళ్లకు కుళాయిల ద్వారా నీటి సరఫరా జరుగుతోంది.

మెడికల్ కాలేజీ పనులు వేగవంతం చేయాలి : మంత్రి సత్యవతి రాథోడ్

మహబూబాబాద్, డిసెంబర్ 9:: మెడికల్ కాలేజీ పనులు వేగవంతం చేయాలని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ అధికారులను ఆదేశించారు. మహబూబాద్ పట్టణంలోని 551 సర్వే నెంబర్ లలోని 30 ఎకరాలలో చేపట్టిన మెడికల్ కళాశాల పనులను గురువారం సాయంత్రం పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు.

మంత్రి వెంట ఎమ్మెల్యే శంకర్ నాయక్ జిల్లా కలెక్టర్ శశాంక, ఎస్పీ నంద్యాల కోటిరెడ్డి అదనపు కలెక్టర్ కొమరయ్య, మహబూబాబాద్ మున్సిపల్ చైర్మన్ పాల్వాయి రామ్మోహన్ రెడ్డి. ఆర్.అండ్.బి.ఈ ఈ తానేశ్వర్, ప్రభుత్వ దవాఖాన పర్యవేక్షకులు భూక్యా వెంకట రాములు, తహశీల్దార్ రంజిత్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వరికి బదులు ప్రత్యామ్నాయ పంటలు వేసుకోండి : ఎంపీ రంజిత్ రెడ్డి

న్యూఢిల్లీ, డిసెంబర్ 9:రైతులు వరికి బదులు ప్రత్యామ్నాయ పంటలు వేసుకోవాలని, వరి సాగు చేసి నష్టపోవద్దని, అందుకు రైతులను చైతన్యం చేసే బాధ్యతను రైతు బంధు సమితి ప్రతినిధులు, అధికారులు తీసుకోవాలని చేవెళ్ల లోక్ సభ సభ్యులు డా.జి.రంజిత్ రెడ్డి అన్నారు. వికారాబాద్ జిల్లా ప్రజాప్రతినిధులు, రైతు బంధు సమితి సభ్యులు, జిల్లా అధికారులతో ఏర్పాటు చేసిన ప్రత్యామ్నాయ పంటల సాగు అవగాహన సమీక్ష సమావేశం లో కలెక్టర్ నిఖిల, స్థానిక ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ లతో కలిసి రంజిత్ రెడ్డి హాజరయ్యారు.

ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ? కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర రైతాంగం పై వివక్ష చూపుతుందన్నారు. అందులో భాగంగానే మన రాష్ట్రానికి సంబంధించిన ధాన్యాన్ని కొనుగోలు చేయడం లేదన్నారు. ఈ కారణంగానే రైతులను వరి వేయొద్దని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. రైతులకు నష్టం రావొద్దనే ఉద్దేశ్యంతో సీఎం కేసీఆర్, మన ప్రభుత్వం ఆలోచించి వరి వేయొద్దని కోరుతున్నామన్నారు. ఈ సందర్భంగా రైతులకు ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన కల్పించాలని అధికారులను, ప్రజాప్రతినిధులను ఆదేశించారు. ప్రత్యామ్నాయ పంటలలో పామాయిల్ వంటి పంటలను వేసే విధంగా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. వికారాబాద్ జిల్లాలో వరి సాగును తగ్గించి ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి పెట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశంలో అడిషనల్ కలెక్టర్ మోతీలాల్, జిల్లా వ్యవసాయ అధికారి గోపాల్, జిల్లాలోని ప్రజా ప్రతినిధులు, రైతు బంధు సమితి సభ్యులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం

హైదరాబాద్, డిసెంబర్ 9:గన్ పార్కులో అమరవీరుల స్థూపంకు నివాళులర్పించి, ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కేసీఆర్ చేపట్టిన ఆమరణ నిరాహార దీక్షను విరమించాలని అప్పటి కేంద్ర హోంమంత్రి చిదంబరం ప్రకటించిన రోజు డిసెంబర్ 9 అని దానికి ఫలితంగా త

పంచాయితీ రాజ్ సంస్థల నివేదిక ద్వారా 'సుస్థిర అభివృద్ధి లక్ష్యాల స్థానికీకరణ' విడుదల

న్యూఢిల్లీ, డిసెంబర్ 9:"పంచాయితీ రాజ్ సంస్థ ల ద్వారా సుస్థిర అభివృద్ధి లక్ష్యాల (ఎస్ డి జి) స్థానికీకరణ" నివేదికను కేంద్ర గ్రామీణాభివృద్ధి, పంచాయితీ రాజ్ శాఖ మంత్రి శ్రీ గిరిరాజ్ సింగ్ 7-12-2021 న విడుదల చేశారు.పంచాయితీ రాజ్ శాఖ సహాయ మంత్రి శ్రీ కపిల్ మోరేశ్వర్ పాటిల్ కూడా హాజరయ్యారు.

ఈ సందర్భంగా, జిపిడిపి పురోగతిని పర్యవేక్షించడంపై గ్రామ పంచాయితీ అభివృద్ధి ప్రణాళిక (జిపిడిపి) మానిటరింగ్ డ్యాష్ బోర్డ్ ను , పంచాయితీ రాజ్ సంస్థల ఎన్నికైన ప్రతినిధులు ,కార్యకర్తల సామర్థ్య పెంపు, శిక్షణపై శిక్షణ నిర్వహణ పోర్టల్ ను కేంద్ర గ్రామీణాభివృద్ధి ,పంచాయితీ రాజ్ మంత్రి ప్రారంభించారు. హ్యాండ్ బుక్ ఆన్ ట్రైనింగ్ మేనేజ్ మెంట్ పోర్టల్ ను కూడా విడుదల చేశారు.

ఎస్ డిజిల ను సాధించే దిశగా కార్యాచరణ ప్రణాళికగా పనిచేసే ఈ సమాచార నివేదికను తీసుకురావడంలో పంచాయితీ రాజ్ మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేసిన నిపుణులకమిటీ కృషిని శ్రీ గిరిరాజ్ సింగ్ ప్రశంసించారు. 2030 నాటికి సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను సాధించడానికి భారత దేశం కట్టుబడి

ఉందని ఆయన నొక్కి చెప్పారు. పంచాయతీరాజ్ సంస్థల 32 లక్షల మంది ఎన్నికైన ప్రతినిధులు ఎస్ డిజిలను సాధించడం ఒక సవాలుగా పరిగణించాలని, ఇందుకు అట్టడుగు స్థాయిలో దృష్టి సారించి సంఘటిత పద్ధతిలో పనిచేయడం ప్రారంభించాలని ఆయన ఉద్బోధించారు. సర్వతోముఖాభివృద్ధి కోసం నాణ్యమైన తోటలు, అన్ని రకాల పోషకాహార లోపం, ఆరోగ్యం, విద్య, జీవన సౌలభ్యం, జీవనోపాధి అవకాశాలు మొదలైన సమస్యలను పరిష్కరించాలని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి పంచాయితీరాజ్ సంస్థలకు పిలుపునిచ్చారు. గ్రామీణ ప్రాంతాల్లోని నివాసితులకు ఆరోగ్య , స్వచ్ఛత కేంద్రాలు, స్వచ్ఛమైన తాగునీరు, మెరుగైన పారిశుద్ధ్య సేవలను అందించడం పై కూడా పంచాయితీలు దృష్టి సారించాల్సిన అవసరం ఉందని అన్నారు.

ఏకీకరణ లేదా కలయిక (కన్వర్జెన్స్)అవసరాన్ని వివరిస్తూ, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (ఎం జి ఎన్ ఆర్ ఈ జి ఏ) పనులతో మంచి ప్రణాళికాబద్ధంగా సమన్వయంతో ప్రభావవంతమైన కలయిక ద్వారా చాలా సాధించవచ్చని శ్రీ గిరిరాజ్ సింగ్ అన్నారు.

అట్టడుగు స్థాయి నుంచి శీఘ్ర మార్పు రావాలన్న ప్రధాన మంత్రి దార్శనికత కు ఆచరణ రూపం కల్పించేలా పంచాయితీ రాజ్ సంస్థల అన్ని స్థాయిల అధికారులు , నిర్వాహకులు భావోద్వేగం తోను, అంకిత భావంతోను పనిచేయాలని గిరిరాజ్ సింగ్ పిలుపునిచ్చారు.

కర్ణాటక రాష్ట్రవ్యాప్తంగా వివిధ గ్రామ పంచాయితీల్లోని పంచాయితీ లైబ్రరీల్లో ఇ-లెర్నింగ్ సదుపాయం , డిజిటల్ లైబ్రరీల ద్వారా వివిధ పోటీ పరీక్షల విద్యార్థులకు అందించే ప్రయోజనాల గురించి కేంద్ర పంచాయితీ రాజ్ మంత్రి ప్రత్యేకంగా ప్రస్తావించారు. అన్ని పంచాయితీల్లో డిజిటల్ లైబ్రరీలను ఏర్పాటు చేయాలని ఎన్నికైన ప్రతినిధులు , నిర్వాహకులు తీర్మానించి నట్లయితే, అది కూడా వాస్తవం కాగలదని ,దీనికి కేవలం దృఢమైన సంకల్పం అవసరమని కేంద్ర పంచాయితీ రాజ్ మంత్రి విశ్వాసం వ్యక్తం చేశారు.

తమిళనాడులోని కోయంబత్తూరు జిల్లా ఒడంతురై గ్రామ పంచాయితీ సాధించిన విజయాలను ప్రస్తావిస్తూ- ఈ పంచాయితీ విద్యుత్ ఉత్పత్తిలో స్వయం సమృద్ధి సాధించినందుకు విస్తృతంగా ప్రసిద్ధి, ప్రశంసలు పొందిందని చెప్పారు. ఇతర గ్రామ పంచాయితీలు కూడా ఇదే విధంగా నిర్ణయించినట్లయితే, అవి ఇంధన ఉత్పత్తి లేదా ఇతర రంగాలలో స్వయం సమృద్ధి సాధించగలవని కేంద్ర పంచాయితీ రాజ్ మంత్రి శ్రీ గిరిరాజ్ సింగ్ ఆశాభావం వ్యక్తం చేశారు.

ఈ సంద ర్భంగా పంచాయితీ రాజ్ సహాయ మంత్రి శ్రీ కపిల్ మోరేశ్వర్ పాటిల్ ప్రసంగిస్తూ, పంచాయతీ స్థాయిలో జీవనోపాది అవకాశాల ను పెంపొందించడానికి, మరింత మెరుగైన ఉపాధి అవకాశాలను కల్పించేందుకు వ్యవస్థాపక చొరవలు తీసుకోవాలని పిలుపునిచ్చారు. నివేదికను ప్రశంసించిన శ్రీ కపిల్ మోరేశ్వర్ పాటిల్, "పంచాయితీ రాజ్ సంస్థల ద్వారా సుస్థిర అభివృద్ధి లక్ష్యాల (ఎస్ డిజిలు) స్థానికీకరణ" పై నివేదిక సమాజంలోని చివరి వ్యక్తికి అభివృద్ధి ప్రయోజనాలను తీసుకెళ్లడానికి ఒక రోడ్ మ్యాప్ గా పనిచేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రధాన మంత్రి దార్శనికత ఆధారంగా, పంచాయితీలు ప్రధానమంత్రి దార్శనికత నుండి పొందిన స్ఫూర్తి, విశ్వాసంతో అభివృద్ధి పనులను చేపట్టాలనీ అన్నారు. ఉన్నత స్థాయి తెలివితేటలు ,,సరైన ప్రణాళిక మొత్తం పురోగతికి మార్గం సుగమం చేస్తాయని, గ్రామీణ ప్రాంతాల్లో పేదరికాన్ని అంతం చేస్తుందని కపిల్ మోరేశ్వర్ పాటిల్ అన్నారు.

పంచాయితీ రాజ్ మంత్రిత్వ శాఖ కార్యదర్శి శ్రీ సునీల్ కుమార్ మాట్లాడుతూ, "పంచాయితీ రాజ్ సంస్థల ద్వారా సుస్థిర అభివృద్ధి లక్ష్యాల (ఎస్ డిజిలు) స్థానికీకరణ" నివేదిక సమ్మిళిత వృద్ధి దిశగా ఒక దృఢమైన అడుగు" అని అభివర్ణించారు. ఈ నివేదిక రాబోయే సంవత్సరాల్లో మార్పును చూపిస్తుందని అన్నారు. సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను సాధించడానికి, సంబంధిత విభాగాలు అన్నీకూడా సమిష్టి ప్రయత్నాలు చేయాలనీ, మొత్తం ప్రభుత్వ విధానం అవసరమైన విస్తృత సమస్యలు ,వ్యూహాలపై పనిచేయడం ప్రారంభించాలనీ అన్నారు. అట్టడుగు స్థాయిలో చురుకైన సమాజ భాగస్వామ్యం ద్వారా ఎస్ డిజిలను సాధించడం కోసం భాగస్వాములందరినీ వేదికపైకి తీసుకురావడంలో మొత్తం ప్రభుత్వ విధానం ఒక అవశ్యకమైన ,ముఖ్యమైన దోహదకారి గా ఉంటుందని అన్నారు. ఈ రోజు ఆవిష్కరించిన డ్యాష్ బోర్డులు సంబంధిత మంత్రిత్వ శాఖలు/ విభాగాలు , పంచాయితీ రాజ్ వాటాదారులకు కూడా ప్రయోజనకరంగా ఉంటాయని ఎంఒపిఆర్ కార్యదర్శి శ్రీ సునీల్ కుమార్ తెలిపారు.

"పంచాయితీ రాజ్ సంస్థల ద్వారా సుస్థిర అభివృద్ధి లక్ష్యాల (ఎస్ డిజిలు) స్థానికీకరణ" నివేదికపై తమిళనాడు ప్రభుత్వ అదనపు ప్రధాన కార్యదర్శి శ్రీ జయశ్రీ రఘునందన్ సవివర ప్రజంటేషన్ ఇచ్చారు.. జిపిడిపి పురోగతిని పర్యవేక్షించడంపై జిపిడిపి మానిటరింగ్ డ్యాష్ బోర్డ్, పంచాయితీ రాజ్ సంస్థల ఎన్నికైన ప్రతినిధులు నిర్వాహకుల సామర్థ్య పెంపు, శిక్షణ నిర్వహణ పోర్టల్ పంచాయితీ రాజ్ మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రటరీ శ్రీ రేఖ యాదవ్ ప్రజంటేషన్ ఇచ్చారు.

శ్రీ సునీల్ కుమార్, కార్యదర్శి, పంచాయతీరాజ్ మంత్రిత్వ శాఖ, శ్రీమతి. జయశ్రీ రఘునందన్, తమిళనాడు ప్రభుత్వ అదనపు ప్రధాన కార్యదర్శి, శ్రీ (డా.) చంద్ర శేఖర్ కుమార్, పంచాయతీరాజ్ మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి, శ్రీ కే. ఎస్ . సేథి, శ్రీమతి రేఖా యాదవ్, పంచాయతీరాజ్ మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి, ఇంకా పంచాయతీరాజ్ మంత్రిత్వ శాఖకు చెందిన ఇతర సీనియర్ అధికారులు పాల్గొన్నారు.విద్యా మంత్రిత్వ శాఖ, న్యాయ మంత్రిత్వ శాఖ, పర్యావరణ మంత్రిత్వ శాఖ, అటవీ ,వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ, గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ, గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ, మహిళా ,శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ, సామాజిక న్యాయ మంత్రిత్వ శాఖ, గణాంకాల మంత్రిత్వ శాఖ, కార్యక్రమ అమలు, నైపుణ్యాభివృద్ధి, ఎంటర్ప్రిన్యుర్ మంత్రిత్వ శాఖ సహామంత్రి అన్ని కేంద్ర మంత్రిత్వ శాఖల అధికారులు, రాష్ట్రాలు/ యూటీల పంచాయతీ రాజ్ శాఖల అధికారులు, ఎన్ ఐ ఆర్ డి అండ్ పి ఆర్, ఎన్ ఐ ఆర్ డి అండ్ పి ఆర్ ల అధికారులు, ఎఫ్ ఎ ఓ, ఐ ఎ ఎల్ ఓ, యు ఎన్ డి పి , యు ఎన్ ఎఫ్ పి ఎ , యు ఎన్ వుమెన్, యు ఎన్ ఈ పి, డబ్లు హెచ్ ఓ ఐ ఎన్ సి ఇ ఎఫ్ వంటి యు ఎన్ ఏజెన్సీల ప్రతినిధులు వర్చువల్ మోడ్ ద్వారా కూడా కార్యక్రమానికి హాజరయ్యారు.

భారతదేశం సస్టైనబుల్ డెవలప్‌మెంట్ గోల్స్ (ఎస్ డి జి) 2030పై సంతకం చేసింది. పంచాయతీ రాజ్ మంత్రిత్వ శాఖ (ఎన్ఓ పి ఆర్) రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ (ఆర్ జి ఎస్ ఎ) పథకం ద్వారా ఎస్ డి జి ల విజయాలకు కట్టుబడి ఉంది. ఆర్ జి ఎస్ ఎ పథకం గ్రామ పంచాయతీ స్థాయిలో భాగస్వామ్య స్థానిక ప్రణాళిక తో ఎస్ డి జి లను సాధించడం ద్వారా సుపరిపాలన కోసం ఎన్నికైన ప్రతినిధులను నిర్దేశిస్తుంది.

మే 2021లో, పంచాయితీ స్థాయిలో ఎస్ డి జి ల స్థానికీకరణపై మంత్రిత్వ శాఖకు విధాన మార్గదర్శకాలను అందించడానికి ఎం ఓ పి ఆర్ ద్వారా నిపుణుల బృందాన్ని ఏర్పాటు చేశారు. తమిళనాడు ప్రభుత్వ అదనపు ప్రధాన కార్యదర్శి జయశ్రీ రఘునందన్, నిపుణుల బృందానికి నాయకత్వం వహించారు, ఎం ఓ పి ఆర్,, రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖలు ,స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్ మెంట్ అండ్ పంచాయితీ రాజ్ (ఎస్ ఐ ఆర్ డి అండ్ పి ఆర్) ల నుండి సీనియర్ అధికారులు ఇతర సభ్యులు గా ఉన్నారు.

సమగ్ర చర్చల తరువాత నిపుణుల బృందం అక్టోబర్ 2021 లో ఒక వివరణాత్మక నివేదికను సమర్పించింది, గ్రామీణ భారతదేశంలోని పంచాయితీ రాజ్ సంస్థలు (పిఆర్ఐలు), సంబంధిత భాగస్వాములందరినీభాగస్వాములను చేసి అట్టడుగు స్థాయిలో ఎన్ డిజిలను స్థానికీకరించడానికి తీసుకోవాల్సిన వ్యూహాలు చొరవలపై సిఫార్సులతో ఈ నివేదికను సమర్పించింది

ప్రతి రెండు గంటలకోసారి పోలింగ్ శాతం తెలపాలి..

మెదక్, డిసెంబర్ 9(నేటినిజం ప్రతినిధి):: ఉమ్మడి మెదక్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హరీశ్ సెక్టోరల్ అధికారులకు బుధవారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా నిర్వహించాలన్నారు. ప్రతి రెండు గంటలకు ఒకసారి పోలింగ్ శాతం తెలపాలని సూచించారు. ప్రతి పోలింగ్ కేంద్రానికి రెండు బ్యాలట్ బాక్సులు ఇస్తున్నామని, పోలింగ్ ప్రారంభానికి ముందు, పోలింగ్ పూర్తయిన తర్వాత ఏజెంట్ల సమక్షంలో బ్యాలట్ బాక్సు తెరవడం, క్లోజ్ చేయడం చేయాలన్నారు. బ్యాలట్ పేపర్ పద్ధతిలో జరిగే ఈ పోలింగ్‌లో ఓటర్లకు ఇండెబుల్ ఇంకు వేలుకు రాయరని, ఓటర్లు ఎన్నికల అధికారులు ఇచ్చే వయొలెట్ కలర్ పెన్‌తోనే ప్రాధాన్యతా క్రమంలో అంకెల రూపంలో రాయాలని తెలిపారు. రిసెప్షన్ కేంద్రం నుంచి ఎన్నికల సామగ్రిని చెక్ లిస్ట్ ప్రకారం సరిగ్గా చూసుకోవాలని, రిసెప్షన్ కేంద్రం నుంచి బయలుదేరిన తర్వాత ఎక్కడా ఆగకుండా కేంద్రానికి వెళ్లాలన్నారు. పోలింగ్ ముగిసిన తర్వాత నేరుగా రిసెప్షన్ కౌంటర్‌కు వచ్చి అప్పగించాలని సూచించారు. పోలింగ్ కేంద్రంలో ఓటర్లకు అనుకూలంగా సీటింగ్ ఏర్పాట్లు చేసుకోవాలని, కేంద్రంలో అవసరమైన మేరకు షామియానాలు, తాగునీరు, మరుగుదొడ్లు, ఫర్నిచర్, విద్యుత్, ర్యాంప్ ఏర్పాటు చేసుకోవాలన్నారు. స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటరు తమ ఓటు హక్కు వినియోగించుకునేలా వాతావరణం కల్పించాలన్నారు. ఏ చిన్న సంఘటన జరిగినా ఎన్నికల కమిషన్ చాలా సీరియస్‌గా తీసుకుంటుంది కాబట్టి జాగ్రత్తతో పనిచేయాలని, ఏమైనా ఇబ్బందులుంటే తక్షణమే అధికారులకు తెలుపాలని అధికారులకు సూచించారు.

ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ పకడ్బందీగా నిర్వహించాలి

నేడు ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 వరకు పోలింగ్

11 గుర్తింపు కార్డుల్లో ఏదైనా ఒక కార్డుతో ఓటు వేయవచ్చు

ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేయాలి

ఏఎస్ఎంలను అందుబాటులో ఉంచాలి

14న కౌంటింగ్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలి

వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి డాక్టర్ శశాంక్‌గోయల్

సంగారెడి, డిసెంబర్ 9(నేటినిజం ప్రతినిధి): ఈ నెల 10న జరగున్న స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌ను పకడ్బందీగా, నిష్పక్షపాతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకోవా లని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి డాక్టర్ శశాంక్‌గోయల్ తెలిపారు. బుధవారం స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియపై అన్ని జిల్లాల కలెక్టర్లు, పోలీసు కమిషనర్లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల అధికారి మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్థానాలకు రేపు ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 వరకు పోలింగ్ జరుగుతుందని, అన్ని పోలింగ్ కేంద్రాల్లో కరోనా జాగ్రత్తలు తీసుకోవాలని, హెల్త్ వర్కర్లను నియమించాలని సూచించారు. ఎన్నికల పోలింగ్ కేంద్రాల లోపలికి సెల్ ఫోన్లను అనుమతించకూడదన్నారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ నిర్వహించాలని సూచించారు. ఎన్నికల నిర్వహణకు గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. పోలింగ్ సామగ్రితో డిస్ట్రిబ్యూషన్ సెంటర్ నుంచి కేంద్రాలకు వెళ్లేటప్పుడు, తిరిగి పోలింగ్ ముగిశాక బ్యాలట్ బాక్స్‌లతో రిసెప్షన్ సెంటర్‌కు వచ్చేటప్పుడు బందోబస్తుతో రావాలన్నారు. ఓటర్ల గుర్తింపు కార్డులు లేదా భారత ఎన్నికల సంఘం సూచించిన 11 గుర్తింపు కార్డుల్లో ఏదేని ఒకటి పరిశీలించాకే ఓటు వేసేందుకు అనుమతి ఇవ్వాలని తెలిపారు. పోలింగ్ అధికారులు ఇచ్చే వయొలెట్ పెన్నుతోనే బ్యాలెట్ పేపర్‌పై ప్రాధాన్యత క్రమంలో అంకెలు వేసేలా ఓటర్లకు చెప్పాలన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేయాలని, ఏఎస్ఎంలను అందుబాటులో ఉంచాలని సూచించారు. ఈ నెల 14వ తేదీన జరిగే కౌంటింగ్ ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. మెదక్ జిల్లా నుంచి వీడియోకాన్ఫరెన్స్‌లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, సహాయ ఎన్నికల అధికారి రమేశ్, స్వీప్ నోడల్ అధికారి రాజిరెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి తరుణ్‌కుమార్, సెక్టోరల్ అధికారులు, ఎన్నికల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. సంగారెడ్డి జిల్లా కేంద్రం నుంచి కలెక్టర్ హనుమంతరావు, ఎస్పీ రమణకుమార్, అదనపు కలెక్టర్ వీరారెడ్డి, అదనపు ఎస్పీ, ఆర్డీవోలు తదితరులు పాల్గొన్నారు. సిద్దిపేట కలెక్టరేట్ కార్యాలయం నుంచి సిద్దిపేట జిల్లా అడిషనల్ కలెక్టర్ ముజామ్మిల్‌ఖాన్, సీపీ జోయల్ డెవిస్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా సోనియాగాంధీ జన్మదిన వేడుకలు

రాజన్న సిరిసిల్ల, డిసెంబర్ 9 (నేటినిజం ప్రతినిధి):వేములవాడ పట్టణం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సోనియా గాంధీ జన్మదిన వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయం ముందు యాచకులకు పండ్లు పంపిణీ చేశారు. తెలంగాణ ఇచ్చిన సోనియాగాంధీ అన్ని వర్గాలతో సుఖసంతోషాలతో ఉండాలని స్వామివారిని వేడుకున్నట్లు కాంగ్రెస్ నాయకు తెలిపారు అనంతరం సోనియా గాంధీ జన్మదిన సందర్భంగా కాంగ్రెస్ డిజిటల్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని వేములవాడ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు సాగరం వెంకటస్వామి ప్రారంభించారు. సందర్భంగా సాగరం వెంకటస్వామి మాట్లాడుతూ వేములవాడ పట్టణంలో కాంగ్రెస్ పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతంగా చేసి అత్యధికంగా మెంబర్ షిప్ నమోదు చేయాలని కాంగ్రెస్ నాయకులు పిలుపు ఇచ్చారు. తెలంగాణ రాష్ట్రం ఇచ్చిన మహా తల్లి సోనియా గాంధీ ఆని కొనియాడారు . తెలంగాణ రాష్ట్రం ఇస్తే ఆంధ్ర రాష్ట్రంలో పార్టీ పతనం అయిపోతాదని తెలిసి కూడా తెలంగాణ రాష్ట్ర ప్రజల ఆకాంక్ష మేరకు తెలంగాణ రాష్ట్రం

సోనియాగాంధీ ఇచ్చారని సాగరం వెంకటస్వామి గుర్తుచేశారు. సభ్యత్వం తీసుకున్న వారికి 2 లక్షల రూపాయల ఇన్సూరెన్స్ వర్తిస్తుందని అన్నారు అదే విధంగా కాంగ్రెస్ పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతంగా చేసి అత్యధికంగా మెంబర్ షిప్ నమోదు చేయాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాతసత్యలక్ష్మి కనికరపు రాకేశ్ ,చిలువేరి శ్రీనివాస్ గౌడ్ అరుణ్ తేజ్ చారి ,తోట లహరి,లింగంపల్లి కిరణ్ , ప్రకాష్ ,దాడి మల్లేశం మండే రాజు, తంగెళ్ల గణేష్ , తదితరులు పాల్గొన్నారు

అమర వీరులకు నివాళులు అర్పిస్తున్న జర్నలిస్టులు..

-సైనిక అమరులకు ఘన నివాళి

-కొవ్వొత్తులు వెలిగించి శ్రద్ధాంజలి

రాజన్న సిరిసిల్ల, డిసెంబర్ 9 (నేటినిజం ప్రతినిధి):వేములవాడ పట్టణంలోని తెలంగాణ అమరవీరుల స్తూపం వద్ద అమర జవాన్లకు విలేకరులు శ్రద్ధాంజలి ఘటించారు. బుధవారం రోజున హెలికాప్టర్ ప్రమాదంలో మృతి చెందిన త్రివిధ దళాల అధిపతి జనరల్ బిపిన్ రావత్ తో పాటు అమర

జవాన్లకు జర్నలిస్టులు నివాళులర్పించారు.కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా వారు దేశానికి చేసిన సేవలను గుర్తు చేసుకొని కొనియాడారు. మృతుల కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి సంతాపాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే రాష్ట్ర ఉపాధ్యక్షులు సయ్యద్ లాయక్ పాషా, మహమ్మద్ రఫీ, సయ్యద్ రసూల్,జిల్లా రమేష్, ప్రవీణ్, ప్రదీప్, సందీప్,ఆసీమ్, మురళి తదితరులు పాల్గొన్నారు

పేదింటి ఆడబిడ్డల 5,000 రూపాయలు ఆర్థిక సహాయం అందజేసిన లయన్స్ క్లబ్ సభ్యులు

రాజన్న సిరిసిల్ల, డిసెంబర్ 9 (నేటినిజం ప్రతినిధి): వేములవాడ పట్టణంలోని సుభాష్ నగర్ లో పేదింటి ఆడబిడ్డ స్రవంతి పెళ్లికి వేములవాడ లయన్స్ క్లబ్ సభ్యులు 5,000 అందజేయడం జరిగింది.

ఈ పెళ్లికి లయన్స్ క్లబ్ అధ్యక్షులు రా పెల్లి శ్రీధర్ హాజరైన 5,000 రూపాయలు నగదు అందజేసి నూతన వధూవరులను ఆశీర్వదించారు.ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ అధ్యక్షులు రా పెల్లి శ్రీధర్ మాట్లాడుతూ తమ లయన్స్ క్లబ్ సభ్యులు తీగల వెంకటేశ్వర్ రావు సాంబశివ,సామ వీర రమణ, పంగల ప్రశాంత్ ఈపేదింటి ఆడబిడ్డ పెళ్లికి తమ వంతుగా సహాయం అందజేసి మానవత్వాన్ని చాటుకున్నారనిఅన్నారు.

ఆర్థిక సహాయం అందించిన లయన్స్ క్లబ్ సభ్యులకు 8వ వార్డు ప్రజలు కృతజ్ఞతలు తెలియజేస్తూ ఇలాంటి కార్యక్రమాలెన్నో చేస్తున్న లయన్స్ క్లబ్ అధ్యక్షులు రాపెల్లి శ్రీధర్ తో పాటు సభ్యులు ఆయురారోగ్యాలతో ఉండాలని భగవంతుని కోరుకుంటున్నామనితెలియజేశారు .

తీరంలో గస్తీ మరింత పటిష్టం.. అందుబాటులోకి ఐఎన్ ఎస్ సంధాయక్..

న్యూఢిల్లీ, డిసెంబర్ 9:సర్వే షిప్ ఐఎన్ ఎస్ సంధాయక్‌ను కోల్‌కతాలో అందుబాటు లోకి తీసుకొచ్చారు. ఇండియన్ నేవీకి సర్వే కోసం నాలుగు షిప్‌లను తయారు చేయను న్నారు. ప్రస్తుతం తొలి షిప్ అందుబాటులోకి వచ్చింది. గార్డెన్ రీచ్ షిప్ బిల్డర్స్ అండ్ ఇంజినీర్స్ లిమిటెడ్ వీటిని నిర్మించింది. ఇండియాలో వార్ షిప్స్ తయారు చేసే పెద్ద కంపెనీల్లో ఇదీ ఒకటి. ఈ షిప్పుల్లో దాదాపు 80 శాతం దేశీయంగానే తయారు చేశారు. రెండు డీజిల్ ఇంజిన్లతో ఇవి నడుస్తాయి.ఈ సంధాయక్ షిప్స్ తీర ప్రాంతంలో, సముద్రపు లోతులో హైడ్రోగ్రాఫిక్ సర్వే చేస్తాయి. తీర ప్రాంత హద్దులనూ సర్వే చేస్తాయి. డిఫెన్స్ వాళ్ల కోసం ఓషనోగ్రాఫిక్, జియోగ్రాఫిక్ డేటాను కూడా సేకరిస్తాయి. దీని వల్ల తీర ప్రాంత గస్తీ, సంరక్షణ సులభమవుతుంది.

ఆసియా పసిఫిక్ ప్రాంతంలో దీర్ఘకాలిక మూత్రపిండాల వ్యాధులతో బాధపడుతున్న రోగులకు మద్దతునందించేందుకు మై కిడ్నీ జర్నీ ప్రారంభించిన బాక్టర్ హెల్త్‌కేర్

హైదరాబాద్, డిసెంబర్ 9: డయాల సిస్ సంరక్షణలో అంతర్జాతీయంగా అగ్రగా మి సంస్థ బాక్టర్ ఆసియా పసిఫిక్ (బాక్టర్) నేడు ఇండియా, సింగపూర్, వియత్నాం, తైవాన్, మలేషియా, థాయ్ ల్యాండ్ సహా ఆసియా పసిఫిక్ (ఏపీఏసీ) ప్రాంతంలో దీర్ఘకాలిక మూత్రపిండాల వ్యాధుల(సీకెడీ) తో బాధపడుతున్న రోగులకు మద్దతునందిం చేందుకు సమగ్రమైన ఆన్‌లైన్ పోర్టల్ మై కిడ్నీ జర్నీని ఆవిష్కరించి ంది.సీకెడీలకు సంబంధించిన అదనపు సమాచారం అయిన టువంటి లక్షణాలు, కారణాలు, దశలతో పాటుగా సీకెడీ నిర్వహి ంచడానికి అందు బాటులో ఉన్న చికిత్సావ కాశాలను సైతం తెలుపుతుంది. వీటితో పాటుగా హోమ్ హెమియోడయాలసిస్ (హోమ్ హెచ్‌డీ), పెరిటోనియల్ డయాల సిస్ (పీడీ) , ఇన్ సెంటర్ డయాలసిస్‌కేర్, కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్ వంటి అంశాలను సైతం తెలుపుతారు. నిజామ్స్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్‌లో నెఫ్రాలజీ డిపార్ట్‌మెంట్ హెడ్ కావడంతో పాటుగా పెరిటోనియల్ డయాలసిస్ సొసైటీ ఆఫ్ ఇండియా గౌరవ సెక్రటరీ డాక్టర్ శ్రీ భూషణ్ రాజు మాట్లాడుతూ "సీకెడీ పెరిగి కొద్దీ ఆందోళన, ఒత్తిడికి గురవడం సహ జం. మార్పిడి చికిత్సలు తప్పనిసరి అవుతుం టాయి. సమ్మతమైన ఆన్‌లైన్ వనరులు అయి నటువ ంటి మై కిడ్నీ జర్నీ లేదా ఆఫ్‌లైన్ సోర్స్‌ల ద్వారా సమాచారం లభించినట్ల యితే సీకెడీ రోగులు మరింత ఉత్తమమైన ఎంపికలను చేసుకోగలరు.

విశాఖలో రోడ్డు ప్రమాదం.. ముగ్గురు దుర్మరణం

విశాఖ, డిసెంబర్ 9: : మధురవా డలో విషాదం చోటుచేసుకున్నది. మోటార్ బైక్‌పై వెళ్తున్న వారిని లారీ ఢీకొట్టడంతో బైకుపై ఉన్న ముగ్గురు అక్కడికక్కడే మృతిచెందారు. మృతుల్లో ఓ చిన్నారి కూడా ఉన్నది. మధురవాడ జాతీయ రహదారిపై గురువారం ఈ రోడ్డు ప్రమాదం జరిగింది.

పోలీసుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. పోలిపల్లి రమణ తన భార్య, కుమార్తెతో భోగాపురం మండలం పోలిపల్లి గ్రామంలో జరిగిన ఒక శుభకార్యా నికి హాజరై తిరిగి ఇంటికి వస్తున్నారు. విశాఖ మధురవాడ సమీపంలోని చంద్రంపాలెం వద్దకు రాగానే వీరు ప్రయాణిస్తున్న బైకును వెనుకనుంచి వేగంగా వచ్చిన లారీ ఒకటి ఢీకొట్టింది. దాంతో బైకుపై ఉన్న ముగ్గురు అక్కడికక్కడి చనిపోయారు. బైకును ఢీకొట్టిన తర్వాత కొద్ది దూరం వరకు వారిని లారీ లాక్కెళ్లింది. మృతులను పోలిపల్లి రమణ, ఆయన భార్య రమాభాయ్ అలియాస్ లక్ష్మి, కుమార్తె దంతి కుమారిగా గుర్తించారు. వీరు విశాఖపట్నంలోని రెల్లి వీధి ప్రాంతంలో నివసిస్తున్నారు. ప్రమాదానికి కారణమైన లారీ ఒడిశా నుంచి అచ్యుతాపురం వెళ్తున్నది. పోలీసులు కేసు నమోదు చేసి తదుపరి దర్యాప్తు జరుపుతున్నారు.

అమృత గడ్డంకు బిడబ్ల్యూ బిజ్‌నెస్ వరల్డ్ యువ వ్యాపారవేత్త అవార్డు 2021

హైదరాబాద్, డిసెంబర్ 9: ప్రముఖ ఆర్గానిక్ స్కిన్‌కేర్ బ్రాండ్ అయిన ది ట్రైబ్ కాన్సెప్ట్స్ వ్యవస్థాపకురాలు, సిఇఓ అయిన అమృత గడ్డం బిజినెస్ వరల్డ్ యంగ్ ఎంటర్‌ప్రెన్యూర్ అవార్డ్స్ 2021 అవార్డ్ పొందారు. బిడబ్ల్యూ బిజ్‌నెస్ వరల్డ్ నిర్వ